ఈనాడు ఆదివారం

3 ఆగస్టు 2025



అక్కాచెల్లెళ్ల బంధం.. అంతకుమించిన అనుబంధం!



ఎంత అల్లరి చేసినా.. ఎంత గొడవ పడినా.. అమ్మ తర్వాత అంతటి ప్రేమను చూపేది అక్కాచెల్లెళ్లే. కొందరు అక్కలు చెల్లికి తల్లి తర్వాత తల్లయితే, ఇంకొందరు చెల్లెళ్లు కష్టసమయాల్లో అక్కలకే అండగా ఉంటూ.. ధైర్యం చెబుతుంటారు. ఈరోజు, 'సిస్టర్స్ డే' సందర్భంగా అలాంటి అక్కాచెల్లెళ్లు పంచుకున్న విశేషాలు...



అల్లరిలో పోటీపడేవాళ్లం

- సాయిపల్లవి

మా చెల్లిని పూజా అనీ పూజామా అనీ పిలుస్తుంటా. తనేమో నన్ను బెస్ట్ ఫ్రెండ్ అంటుంది. మేం కవల పిల్లల్లానే పెరిగాం. నాకు సూర్య ఇష్టమైతే, తనకు ధనుష్ అంటే అభిమానం. అందుకే 'మారి2' షూటింగ్ సమయంలో తనని సెట్స్‌కు తీసుకెళ్లి... ధనుష్‌తో మాట్లాడించా. ఇక, నేను ఇష్టంగా ఏదయినా డ్రెస్ కొని తెచ్చుకుని ఎప్పుడైనా వేసుకుందామని అనుకునేలోగా.. అది మా చెల్లి వేసేసుకునేది. నేను సినిమాల్లోకి వచ్చి... కాస్త బిజీ అయ్యాక తనతో గడిపే సమయం తగ్గింది. అందుకే ఏ మాత్రం బ్రేక్ దొరికినా ఇంటికి వెళ్లిపోతుంటా. అయితే... మా చెల్లి ఇంత త్వరగా పెళ్లి చేసుకుంటుందని నేను ఊహించలేదు. చిన్నప్పటి నుంచీ తనకు గోరింటాకు పెట్టడం నాకు అలవాటు. పెళ్లి సమయంలో కూడా నేనే తనకు మెహందీ పెట్టడం, పెళ్లికూతురిగా ముస్తాబు చేయడం ఎంత ఆనందంగా అనిపించిందో. తను ఎంత అల్లరి చేసినా... నేను కాస్త ఆందోళనకు లోనవుతున్నట్లు కనిపిస్తే.. వెంటనే కేర్‌టేకర్‌గా మారిపోతుంది. పూజ మొదటి సినిమాలో అద్భుతంగా నటించిన తీరును చూసి నేనే ఆశ్చర్యపోయా. ఆ సినిమా చూసి... 'నటనకు కొత్త అయిన తనే అంత బాగా చేస్తే.. ఇండస్ట్రీలో ఇంత అనుభవం ఉన్న నేనెంత చేయాలీ' అనుకున్నా.

చెల్లి కాదు అక్క

- జాన్వీకపూర్

మా చెల్లి ఖుషీతో పోలిస్తే నేను కాస్త సెన్సిటివ్. తనదేమో సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే స్వభావం. నేనూ ఖుషీ చిన్నప్పటి నుంచీ అల్లరిచేయడం, కొట్టుకోవడం... ఆ తర్వాత అమ్మ దగ్గరకు వెళ్లి ఒకరిమీద మరొకరం ఫిర్యాదు చేయడం... ఇలా మా మధ్య ఎన్నో ఉన్నాయి. అయితే, అమ్మ చనిపోయాక మా అనుబంధం బాగా పెరిగింది. ఆ రోజు... అమ్మ చనిపోయిన వార్త తెలిసి ఖుషీ ఏడుస్తోంది. నేనూ తన దగ్గరకు వెళ్లి ఏడవడం మొదలుపెట్టేసరికి అంత బాధలోనూ ఏడుపు ఆపేసి నన్ను ఓదార్చింది. ఆ తర్వాతా నేనైనా అప్పుడప్పుడూ అమ్మకోసం కన్నీళ్లు పెట్టుకున్నా కానీ.. ఖుషి ఏడవడం చూడలేదు. అంతేనా... నా సినిమాల వివరాలూ వ్యక్తిగత విషయాలూ... ఏది చెబుతున్నా ఓపిగ్గా విని, సలహాలు ఇస్తుంటుంది. చెప్పాలంటే ఒక్కోసారి తనే నాకు అక్కలా మారిపోతుంది.

రెండో అమ్మని - రశ్మిక మందన్నా



నాకూ, మా చెల్లి షిమన్‌కూ మధ్య వయసులో పదహారు సంవత్సరాలు తేడా. దాంతో నేను ముందునుంచీ తన అవసరాలు చూసేదాన్ని. ఇప్పుడు కూడా తను కోరుకున్నవన్నీ నిమిషాల్లో కొనివ్వగలిగినా ఆ పని చేయను. ఆ వస్తువు నిజంగానే అవసరం అని నిర్ధారించుకున్నాకే కొనిస్తా. తను కూడా పెద్దయ్యాక నాలా సినిమాల్లోకి రావాలని అనుకుంటోంది కానీ, చూడాలి ఏమవుతుందో. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నాలుగైదు సినిమాలు ఇంటిల్లిపాదీ కలిసి చూశాం. ఆ తర్వాత నేను షూటింగ్‌లతో బిజీ కావడంతో... తనే అమ్మావాళ్లతో చూడటం మొదలుపెట్టింది. విచిత్రం ఏంటంటే.. స్క్రీన్‌మీద నేను ఏడ్చిన సీన్లు వస్తే.. తను కూడా వెంటనే ఏడ్చేసి.. నాకు ఫోన్ చేసి ఇంటికొచ్చేయమంటుంది. నాకు కూడా ఎప్పుడెప్పుడు ఇంటికెళ్లి చెల్లితో సరదాగా గడుపుతానా అని ఉంటుంది కానీ... అన్నిసార్లూ అది కుదరట్లేదు.

ఇద్దరం ఒకరికొకరం - కీర్తిసురేష్

మా అక్క రేవతి మంచి డాన్సర్. ఇండస్ట్రీలోనే పని చేస్తోంది. ఒకప్పుడు అక్క చాలా లావుగా ఉండేది. తర్వాత ఇద్దరం యోగాలో చేరాం. నా ప్రోత్సాహంతోనే బరువు తగ్గానని అక్క చెప్పినా... తను లేకపోతే నేను లేనని గర్వంగా అంటుంటా. ఎందుకంటే... నాకు ముందు నుంచీ సినిమాలంటే ఇష్టం. నాన్నేమో నేను నటించిన సినిమా ఫ్లాప్ అయి, మరిన్ని అవకాశాలు రాకపోతే ఎలా అనేవారు. అలాంటి సమయంలో 'గీతాంజలి' దర్శకుడు ప్రియదర్శన్ మా ఇంటికొచ్చి, నన్ను నటించమని అడిగారు. అప్పుడు అక్కే నాన్నకు సర్దిచెప్పింది. ఆయన భయపడినట్లుగానే మొదట్లో నాకు అంత గుర్తింపు రాలేదు. ఆ సమయంలో అక్కే నాలో ధైర్యాన్ని నింపింది. నటన గురించి ఎన్నో విషయాలు చెప్పేది. 'నేను లోకల్' సినిమాను ఒప్పుకున్నప్పుడు... నానీ సహజ నటుడనీ తనతో పోటీపడి నటించాలంటే కాస్త ఎక్కువగా కష్టపడాలనీ వివరించింది. అక్క చెప్పినట్టుగానే నన్ను నేను మెరుగుపరచుకున్నా. అన్నింటికన్నా... 'మరక్కర్'కు అక్క టెక్నిషియన్‌గా, నేను నటిగా కలిసి పనిచేయడం ఓ మంచి జ్ఞాపకం.



మేమిద్దరం ఫ్రెండ్స్

- కాజల్

నాకూ, చెల్లి నిషాకీ వయసులో పెద్ద తేడా లేకపోవడంతో మేమిద్దరం స్నేహితుల్లాగే ఉంటాం. షూటింగ్‌కో, విహారానికో... ప్రపంచంలో ఎక్కడికెళ్లినా తనకోసం మాత్రమే షాపింగ్ చేస్తుంటా. చిన్నప్పుడు అదే అల్లరి చేసి, ఏమీ తెలియనట్లు ఏడ్చేసి, అమ్మానాన్న ముందు నన్ను బుక్ చేసేది. నేను కాస్త ఎమోషనల్. చెల్లి మాత్రం చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తుంటుంది. ఏ లాజిక్ కూడా మిస్సవ్వదు. అందుకే పెళ్లీ, పిల్లలూ లాంటి ముఖ్యమైన విషయాల్లో తన సలహా తీసుకున్నా. మా ఇద్దరికీ పెళ్లిళ్లు అయిపోయి పిల్లలు పుట్టినా, ఇప్పటికీ వీలు చూసుకుని అందరం కలిసి ఫ్యామిలీ ట్రిప్స్‌కు వెళ్తుంటాం. రోజులు గడిచేకొద్దీ మా రిలేషన్ మరింత స్ట్రాంగ్ అవుతోంది.



లోపల

మంచిమాట

నవ్వు వెనక బాధనూ మౌనంచాటు మాటనూ కోపంమాటు ప్రేమనూ అర్థం చేసుకునేవారే నిజమైన స్నేహితులు.

అనుకున్నదొకటి...



రంగ: మా ఆవిడ మెచ్చుకుంటుందని పొద్దున- నల్లగా ఉన్న మూకుడుని రుద్ది రుద్ది తెల్లగా తోమా. అది చూసి పిచ్చ తిట్లు తిట్టింది రా...

గిరి: ఎందుకని... ఇంకా సరిగా శుభ్రం చేయలేదనా?

రంగ: కాదు రా. నాకేం తెలుసు... నేను తెల్లగా తోమింది నాన్‌స్టిక్ మూకుడని!

మన సామెత

దోసకాయలు తిన్న కడుపూ దొంగలుపడ్డ ఇల్లూ ఒకటే.

వైద్య నారాయణులు... పల్లెదారి పట్టారు!

మన దేశానికి వెన్నెముక పల్లెసీమలేనంటారు. కానీ ఆ వెన్నెముక సరైన వైద్య సౌకర్యాల్లేక బీటలు వారుతోంది. ఆరోగ్య అత్యవసర పరిస్థితివస్తే దేవుడిపైన భారమేసి నిస్సహాయంగా చూడాల్సిన దయనీయస్థితి కొన్ని పల్లెలది. కరవు జిల్లాలూ, గిరిజన గూడేల్లో ఆ పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. అలాంటి ప్రాంతాలకి మహత్తర సేవలందిస్తున్నారు ఈ వైద్యులు. కోట్ల సంపాదన వద్దనుకుని పేదల కన్నీళ్లు తుడుస్తున్నారు. వైద్యమంటే త్యాగం కూడానని గుర్తుచేస్తున్నారు.

ఊరిని దత్తత తీసుకున్నాడు!

డాక్టర్ రాజన్ దేశ్‌పాండే... కర్ణాటకలో పేరున్న పిల్లల డాక్టర్. ప్రతిష్ఠాత్మక బీసీ రాయ్ అవార్డు గ్రహీత. అంత పేరుప్రతిష్ఠలు ఉన్నవాడు ఏ మహానగరంలోనో కొలువుదీరకుండా కర్ణాటకలో వెనకపడ్డ జిల్లా ధార్వాడ్‌లో సేవలు మొదలుపెట్టాడు. అక్కడ విఠల్ క్లినిక్ అండ్ నర్సింగ్‌హోమ్‌ని ఏర్పాటుచేసి ఆర్థిక స్తోమతతో పనిలేకుండా అందరికీ ఉన్నత ప్రమాణాల వైద్య చికిత్స అందిస్తుంటాడు. చిన్నారులకి పూర్తి ఉచితంగా గుండె ఆపరేషన్‌లు చేస్తుంటాడు. వారం వారం ధార్వాడ్ చుట్టూ ఉన్న గిరిజన గ్రామాలకెళ్లి ఉచిత శిబిరాలు నిర్వహిస్తుంటాడు. అలా వెళ్లినప్పుడే మడికకొప్ప అనే గ్రామం దైన్యం ఆయన్ని కదిలించింది. రోడ్లే కాదు... ఇళ్లకి సరైన తలుపులు కూడా లేని గ్రామం అది. తాగునీటి వసతులూ ఉండవు. ఆ గ్రామానికి వైద్యం అందించడంతోనే ఊరుకోలేదు డాక్టర్ రాజన్ దేశ్‌పాండే.



దాన్ని తన నర్సింగ్‌హోమ్ తరపున దత్తత తీసుకున్నాడు. వరదలతో కూలిపోయిన 12 కుటుంబాలకి పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చాడు. చక్కటి రోడ్లు వేయించాడు. తాగునీటి వసతుల్ని కల్పించాడు... అక్కడ నామమాత్రంగా ఉన్న బడిని పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తున్నాడు. ఆ గ్రామప్రజలు ధార్వాడ్ జిల్లా కేంద్రందాకా రావాల్సిన అవసరం లేకుండా అక్కడే ఓ క్లినిక్‌నీ ఏర్పాటుచేశాడు.

ఆదివాసీలకు ఆరోగ్య రక్ష

1972 నాటి రోజులు... డాక్టర్ ధనరాజ్ అగర్వాల్ హైదాబాద్‌లో బీఏఎంఎస్ చదివాడు. ఆదిలాబాద్ పట్టణంలో ప్రాక్టీస్ పెట్టాడు. అప్పట్లో ఇంద్రవెల్లి సమీపంలోని ఏజెన్సీ ప్రాంతం జ్వరాలతో నిలువెల్లా వణికిపోతోంది. అతిసారం, కలరాతో గిరిజనులు పండుటాకుల్లా రాలిపోతున్నారు. ఆ ప్రాంతాలకి వైద్యశిబిరం నిమిత్తం వెళ్లిన డాక్టర్ ధనరాజ్ ఆ పరిస్థితి చూసి చలించిపోయాడు. అప్పట్లో ఏ వసతులూ లేని ఇంద్రవెల్లికి మకాం మార్చాడు. రోజూ పాతిక కిలోమీటర్లు నడిచి ఏజెన్సీ ప్రాంతాలకి వెళ్లి మందులివ్వసాగాడు. అవసరమైతే చిన్నపాటి ఆపరేషన్‌లూ చేస్తాడు. వాళ్లు ఇస్తే తీసుకోవడం తప్ప ఎవ్వరి దగ్గరా పైసా అడగడు. అలా గత యాభై ఏళ్లుగా ఎనలేని సేవలందిస్తున్నాడు డాక్టర్ ధనరాజ్. కాలినడక కాస్తా సైకిల్‌కి మారి అది కాస్తా స్కూటర్ అవ్వడం తప్ప ఏ మార్పూ లేకుండా వాళ్లకి వైద్యాన్ని చేరువ చేస్తున్నాడు. ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఉట్నూరు, నార్నూరు మండలాల్లోని దుర్గమమైన గిరిజన గూడేల్లో కూడా ఆయన పేరు తెలియనివారుండరు. అంతేకాదు, గిరిజనులు కీళ్ల సమస్యల కోసమని వేలరూపాయలు ఖర్చుపెట్టి ఆదిలాబాద్‌కి వెళుతుండడం చూసి... యాభై అరవై రూపాయలకే ఆర్థోపెడిక్ సేవల్నీ ప్రారంభించాడు.



- బండారు లక్ష్మీనరసయ్య,
న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

నిరుపేదల నర్సింగ్ హోమ్...

బిహార్ మనదేశంలో బాగా వెనకపడ్డ రాష్ట్రాల్లో ఒకటి. అందులోనూ ఖగారియా జిల్లా అత్యంత కరవు ప్రాంతం. అలాంటి చోట ఓ కుగ్రామంలో పుట్టాడు డాక్టర్ ఎస్ఎం రెహ్మాన్. ఓ రోజు తనకీ తమ్ముడికీ జ్వరం వస్తే... వాళ్లమ్మ జిల్లాకేంద్రంలోని ఓ క్లినిక్‌కి తీసుకెళ్లిందట. డబ్బుల్లేక ఒకరికి రాసిన మందులే ఇంకొకరికీ వాడతామంటే... అక్కడి కాంపౌండర్ ఈసడిస్తున్నట్లు మాట్లాడాడట. అది చిన్నారి రెహ్మాన్ గుండెని గాయపరిచి పట్టుదలని రేపింది. ఎన్నో కష్టనష్టాలని భరించి ఎంబీబీఎస్ చదువుకున్నాడు. దిల్లీ ఆపోలో ఆసుపత్రి కార్డియాలజీ విభాగంలో మంచి పేరుతెచ్చుకున్నాడు. ఐదారేళ్ల తర్వాత- అక్కడిస్తున్న ఐదంకెల జీతాన్ని వదులుకుని తన సొంత జిల్లాలోనే 'నేషనల్ మెడికేర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్' పేరుతో ఆసుపత్రిని నిర్మించాడు. రూ.50 ఫీజుకే అన్ని రకాల వైద్య సేవలూ అందిస్తున్నాడు డాక్టర్ రెహ్మాన్. ఆ ఫీజూ ఇవ్వలేని పేదలకి ఉచితంగానే చికిత్స అందిస్తాడు. ఆపరేషన్‌లూ, ఐసీయు స్థాయి సేవలు కూడా వెయ్యి రూపాయలకి మించవు అక్కడ. 'ఇదెలా సాధ్యమవుతోంది డాక్టర్...?' అంటే 'ఆసుపత్రి ఖర్చులకి తప్ప లాభాలేవీ ఆశించడం లేదు. నేనూ నాతో వచ్చే వైద్యులెవ్వరం ఫీజు తీసుకోవట్లేదు అంతే' అంటాడు డాక్టర్ రెహ్మాన్.





మందులు... సగం కన్నా తక్కువ ధరకే..!

'బాబుకు మొన్న వైరల్ ఫీవర్ వచ్చిందా... అయిదువేల రూపాయలు ఇట్టే అయిపోయాయి'. 'నాన్నకు బీపీ, షుగర్ ఉన్నాయి. ప్రతినెలా మందులకోసం కొంత బడ్జెట్ పెట్టుకోవడం తప్పట్లేదు'. 'పాపాయికోసం కొనే లోషన్లూ, పాలడబ్బాలకే డబ్బు మంచినీళ్లలా ఖర్చైపోతోంది'... అంటుంటారు కొందరు. ఇలాంటి వారికోసమే ఇప్పుడు కొన్ని ఆన్‌లైన్ ఫార్మసీలు మందులన్నింటినీ ఎక్కువ రాయితీపైన ఇస్తూ... డోర్‌డెలివరీ కూడా చేస్తున్నాయి.

నిత్యావసరాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఫర్నిచర్... ఏదైనా కానివ్వండి, ఎక్కువమంది చలో ఆన్‌లైన్ అనేస్తున్న రోజులివి. ఎంతోకొంత రాయితీపైన లభించడం, ఇల్లు కదలాల్సిన అవసరం లేకపోవడం... తదితర కారణాలతోనే ఆన్‌లైన్ స్టోర్లకు ఓటేస్తున్నారు. ఇప్పుడు వీటి వరుసలో కొన్ని ఆన్‌లైన్ ఫార్మసీలు డిస్కౌంట్‌లలో మందుల్ని అందిస్తూ ఆ ఖర్చునూ కొంతవరకూ తగ్గిస్తున్నాయి. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ ఫార్మసీలు... మందులు, వైద్య పరికరాలు, పిల్లలకు అవసరమైన వస్తువులు, పర్సనల్‌కేర్... ఇలా అన్నింటినీ యాభై నుంచి డెబ్బై అయిదు శాతం వరకూ రాయితీపైన ఇస్తాయి. సాధారణ మెడికల్ షాపుల్లో మందులు కొంటే వాటిపైన పది నుంచి ఇరవైశాతం వరకూ డిస్కౌంట్‌ను ఇవ్వడం మామూలే. మరికొన్నేమో... ఆ షాపులోనే ఎంత తరచుగా కొన్నామనేది చూసి ఆ ప్రకారం బిల్లుల్ని కొంతవరకూ తగ్గిస్తాయి. లేదూ... వీటైనంత ఎక్కువ డిస్కౌంట్‌పైన మందుల్ని కొనాలనుకునేవారు జెనరిక్ మెడికల్ షాపులకు వెళ్లొచ్చు కానీ... అవి అన్నిచోట్లా అందుబాటులో ఉంటాయని చెప్పలేం. దీన్ని గుర్తించే - 'దవాదోస్త్', 'ట్రూమెడ్స్', 'ప్లాటినంఆర్ఎక్స్', 'మెడ్‌కార్ట్', 'మెడ్‌బజ్', 'జెనరిక్‌ఆధార్', 'సాయాకేర్', జెనరిక్‌భారత్, 'దవాఇండియా'... వంటి ఫార్మసీలు మందుల్ని తక్కువ ధరకు అందించేందుకు ఏర్పాటు అయ్యాయి. ఇవన్నీ మనం కోరిన వాటితోపాటు కావాలంటే... జెనరిక్ మందుల్ని కూడా డోర్ డెలివరీ చేస్తున్నాయి.







ఇవెలా పనిచేస్తాయంటే...

మధుమేహం, అధికరక్తపోటు, ఇతరత్రా అనారోగ్య సమస్యలకు మందులు లేదా పర్సనల్‌కేర్ కోసం ఉపయోగించుకునే వస్తువులు... ఏవైనా కానివ్వండి, ప్రతినెలా కొనాల్సి రావడం తప్పనిసరి కొందరికి. అలాంటివారు వీటిలో ప్రయత్నిస్తే అటు డబ్బులూ ఆదా అవుతాయి, ఇటు మందులూ ఇంటికే వచ్చి చేరతాయి. ఉదాహరణకు 'దవాదోస్త్' ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ పనిచేస్తుంది. మందులు, వైద్య పరికరాలు.. ఏవి కొనుగోలు చేసినా యాభై నుంచి ఎనభైశాతం వరకూ రాయితీని అందిస్తుంది. దీనిద్వారా ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డ్ కోసమూ నమోదు చేసుకోవచ్చు. ఇక, దీనికి కాస్త భిన్నంగా పనిచేస్తుంది 'ట్రూమెడ్స్'. ఇందులోకి వెళ్లి మనకు కావాల్సిన మాత్రల వివరాలను నమోదు చేశామనుకోండి... ఆ మాత్రలతోపాటు ప్రత్యామ్నాయ మందులు కూడా ధరలతో సహా వచ్చేస్తాయి. ఇంకా... ఈ మాత్రల తయారీలో ఉపయోగించిన ఔషధాలు, ఎలా పనిచేస్తాయి, ఎప్పుడు తీసుకుంటే మంచిది, ఎదురయ్యే సైడ్‌ఎఫెక్ట్స్, ఎవరు వీటిని తీసుకోకూడదు, ఆ మాత్రలు వాడుతున్నప్పుడు తగ్గించాల్సిన ఆహార పదార్థాలు- జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులు... ఇలా అన్నిరకాల వివరాలనూ అందిస్తుంది. 'సాయాకేర్' కూడా ఇంచుమించు ఇదేవిధంగా పనిచేస్తే... 'మెడ్‌కార్ట్' పదిహేను నుంచి ఎనభైశాతం వరకూ రాయితీపైన మందుల్ని ఇవ్వడంతోపాటు.. వాటి ధరల్ని మిగిలినవాటితో పోల్చుకునే సదుపాయాన్నీ కల్పిస్తుంది. అదే 'ప్లాటినం ఆర్ఎక్స్'ను తీసుకుంటే.. ఇందులో డాక్టర్లు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్‌ను అప్‌లోడ్ చేసుకుని ఆ ప్రకారం మందుల్ని రాయితీపైన కొనుక్కోవచ్చు. ఆ ట్యాబ్లెట్స్ అందుబాటులో లేక ప్రత్యామ్నాయ రకాలను ట్రై చేయాలనుకున్నప్పుడు... ఆన్‌లైన్ వైద్యులతో మాట్లాడి సందేహాలని నివృత్తి చేసుకునే సదుపాయాన్నీ కల్పిస్తుందిది. వీటన్నింటికీ దాదాపుగా వెబ్‌సైట్లు లేదా యాప్‌లు ఉన్నాయి కాబట్టి వ్యక్తిగత వివరాలనూ చిరునామానూ నమోదు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందీ లేకుండా కావాల్సిన మందుల్ని తక్కువ ధరకే ఇంటికి రప్పించుకోవచ్చు. కాబట్టి... ఈసారి మందులకి ఇంత ఖర్చవుతోందని బాధపడకుండా...ఇలాంటివాటిని ట్రై చేసి చూడండి. ★

'అమ్మ దీవెన' నా పాట!

'చిరంజీవ'
అంటుంది తుమ్మితే.
'ఇరుగుదిష్టి పొరుగుదిష్టి...' అని
దిగదీస్తుంది బయటకెళ్లొస్తే. 'జీర్ణం జీర్ణం
వాతాపి' అంటుంది బువ్వ తింటే. ఇలా బిడ్డల ప్రతి
కదలికకీ దీవెనల్ని జతచేస్తుంది తల్లి మనసు. ఆ
మనసుని చక్కటి పదలయతో సరళ సుందరంగా
పట్టుకున్న పాట ఇది. కల్లాకపటంలేని తల్లి ప్రేమని
దీవెనలుగా గుర్తుచేసిన గేయం కాబట్టే... విన్నవాళ్ల
కళ్లను చెమ్మగిల్లేలా చేస్తోంది. చిక్కటి పదాలతో
గుండెనిపిండే ఆ పాటను రాసిన యువగేయ
రచయిత నందకిశోర్ తన పాట
గురించి ఏమంటున్నారంటే...



ఏడాదిన్నర కిందటి మాట. మా చెల్లెలికి బాబు పుడితే వాడి కోసం రోజుకో జోలపాట రాసి ఫేస్‌బుక్‌లో పెట్టసాగాను. వాటిని చూసి శేఖర్ కమ్ములగారి అసోసియేట్ చైతన్య పింగళి నన్ను 'కుబేర' సినిమాకి రాయమన్నారు. 'ఊరి నుంచి ఒంటరిగా బతుకుపోరాటానికి బయల్దేరిన ప్రతి ఒక్కరినీ తల్లిజ్ఞాపకాలు వెంటాడుతుంటాయి కదా... దాన్ని ఈ పాట గుర్తుచేయాలి. ఓ తల్లి జాగ్రత్తలు చెబుతున్నట్టూ పాజిటివ్‌గా ఉండాలి' అన్నారు. దాంతో 'ఊరొదిలి పోతున్నావా బిడ్డా...' అన్నట్టు ఓ గేయం రాశాను. 'బిడ్డ' వద్దు 'కొడుకా' అన్నట్టు మార్చుకోండి' అని చెప్పారు శేఖర్‌గారు. ఆయనే 'నా కొడుకా...' అన్న హూక్ ఇచ్చారు. రెండో వెర్షన్‌లో చివరగా వచ్చే 'ఈ దిక్కులు నీతో కదిలేను/ఆ చుక్కలు దిష్టితీసేను/ఏ గాలీ ధూళీ సోకదు నిన్ను అమ్మ దీవెనిది నా కొడుకా..' అన్న చరణాలు ఆయనకు బాగా నచ్చాయి. అలాంటి దీవెనలే పాటలో ఉండాలన్నారు. దాంతో తల్లి దిష్టితీయడాన్నీ గుర్తుచేస్తున్నట్టు మరికొన్నింటిని చేర్చాను. ప్రతి తల్లికీ తాను లేనప్పుడు తన బిడ్డ ఏమవుతాడోనన్న దిగులు వెన్నాడుతుంటుంది కదా! దానికి నేను ప్రకృతిని తోడుతెచ్చుకున్నాను. 'నిన్ను చల్లగా చూడాలని చందమామకీ, కడుపునింపమని చెట్టూచేమకీ, నిద్రపుచ్చమని నీలిమేఘాలకీ చెప్పాన్లే...భయపడకు' అని రాశాను. బతుకు పాఠాలు చెబుతున్నట్టే 'పిట్టలా ముళ్లకంపలో గూడు కట్టే నేర్పు ఉండాల'ని చెప్పించాను. ఇక ఈ పాటలోని మొదటి వాక్యాలు 'పచ్చాపచ్చని చేలల్లో...' సినిమా విజువల్స్ చూశాకే రాశాను. ఆ పచ్చటి చేలనీ అమ్మ తోడులోని నిశ్చింతనీ పాటలోకి తెచ్చాను. మొదట్లో నేనో చోట 'బడిలో చెప్పని పాఠం ఇదిరా బతుకే నేర్చుకో నా కొడుకా' అని రాశాను. దాన్ని 'బతికే నేర్చుకో' అని శేఖర్‌గారు మార్చారు. చిన్న అక్షరం మార్పుతో అర్థం ఎంత చక్కగా మారిందో! నేను రాసిన పాటకి దేవిశ్రీగారి సంగీతం, సింధూరిగారి గళం ఆర్ద్రత నింపి ప్రాణం పోశాయి. పాట విడుదలయ్యాక 'దూరంగా ఉన్న మా అమ్మ గుర్తొస్తోంది...' అంటూ ఎంతోమంది ఫోన్ చేస్తున్నారు. నాకొస్తున్న గొప్ప ప్రశంసలు అవే!

మరోమాట కూడా చెప్పాలి... ఈ పాట విడుదలైన రెండువారాల తర్వాతే మా అమ్మని చూశాను. తను మా చెల్లెలింటికి వస్తే వెళ్లాను. నన్ను చూడగానే అమ్మ ఒక్కమాట కూడా మాట్లాడకుండా... ఉప్పు చేతబట్టి నాకు దిష్టితీసింది! చాలా ఏళ్ల తర్వాత అమ్మ అలా చేస్తుంటే...తననే చూస్తూ ఉండిపోయాను. ★

పాట కచేరి



'పచ్చాపచ్చని చేలల్లో...
పూసేటి పూవుల తావుల్లో...
నవ్వులు ఏరుతు నడిచేద్దాము
చేతులు పట్టుకు నా కొడుకా

కడుపున నిన్నూ దాచుకునీ
నీడల్లే నిన్నూ అంటుకునీ
కలిసే ఉంటా ఎప్పటికీ నీ
చేతిని వదలను నా కొడుకా

పదిలంగా నువు నడవాలే... పది కాలాలూ నువు బతకాలే
చందమామకూ చెబుతున్నా నిను చల్లగ చూస్తది నా కొడుకా

ఆకలితో నువు పస్తుంటే... నీ డొక్కలు ఎండీపోయేరా...
చెట్టుచెట్టుకీ చెబుతున్నా నీ కడుపు నింపమని నా కొడుకా...

నిద్దురలేకా నువ్వుంటే... నీ కన్నులు ఎర్రగ మారేరా...
నీలిమబ్బుతో చెబుతున్నా నీ... జోలపాడమని నా కొడుకా...

మనిషికి మనిషే దూరమురా... ఇది మాయాలోకపు ధర్మమురా..
బడిలో చెప్పని పాఠం ఇదిరా బతికే నేర్చుకొ నా కొడుకా

తిడితే వాళ్లకి తగిలేను... నిను కొట్టిన చేతులు విరిగేను
ఒద్దిక నేర్చీ ఓర్చుకునుండు... ఓపికతోటీ నా కొడుకా

రాళ్ళూ రప్పల దారులు నీవి... అడుగులు పదిలం ఓ కొడుకా
మెత్తటి కాళ్లూ ఒత్తుకుపోతయ్... చూసుకు నడువుర నా కొడుకా!

చుక్కలు దిక్కులు నేస్తులు నీకు చక్కగ బతుకూ ఓ కొడుకా!
ఒక్కనివనుకొని దిగులైపోకు పక్కనె ఉంటా నా కొడుకా...

పానము నీది పిట్టలతోటిది ఉచ్చుల పడకూ ఓ కొడుకా...
ముళ్ళకంపలో గూడు కట్టేటి నేర్పుతొ ఎదగర నా కొడుకా

ఏ దారిలొ నువ్వూ పోతున్నా... ఏ గండం నీకూ ఎదురైనా
ఏ కీడూ ఎన్నడు జరగదు నీకు అమ్మ దీవెనిది నా కొడుకా...

ఈ దిక్కులు నీతో కదిలేను... ఆ చుక్కలె దిష్టి తీసేను
ఏ గాలీ ధూళీ సోకదు నిన్ను అమ్మ దీవెనిది నా కొడుకా

ఏ పిడుగుల చప్పుడు వినపడినా ఏ బూచోడికి నువు భయపడినా
ఈ చీకటి నిన్నేం చేయదులేరా... అమ్మ దీవెనిది నా కొడుకా...!







'అవతార్' సినిమాలో... పండోరా గ్రహం, అక్కడ రాత్రుళ్లు నీలిరంగు కాంతులు విరజిమ్మే అడవులూ గుర్తున్నాయా? ఆ సైన్స్- ఫిక్షన్ సినిమాలో చూపించిన వింత నీలి కాంతులు... రేపోమాపో మన పెరట్లోనూ దర్శనమిచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదెలా సాధ్యం అంటారా... రాత్రుళ్లు మెరిసే బయోలుమినిసెంట్ పెటూనియాలు, చామంతులు, ఆర్కిడ్లు మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి మరి. మెరిసే ఆ పూలమొక్కల విశేషాలేంటో తెలుసుకుందామా...

చీకట్లో మెరిసే... పూలు వచ్చేస్తున్నాయ్!




ఇంద్రధనుస్సు వర్ణాలతో వేడుక చేసే... విరుల సొగసు చూసి మనసు పారేసుకోనివాళ్లు ఎవరుంటారు? అవి ఎంత అందంగా ఉన్నా, ఆ సొగసంతా పగటివేళకే సొంతం. కానీ, చిమ్మచీకట్లోనూ వెన్నెల కాంతులు విరజిమ్ముతూ తోటకే అందం తెచ్చే పూల గురించి విన్నారా? 'ఫైర్‌ఫ్లై పెటూనియా'లు ఈ కోవకే చెందుతాయి. పగలు తెలుపు, ఎరుపు, ఊదా రంగుల్లో కనిపించే ఈ ఆర్నమెంటల్ పూలు చీకటిపడితే పచ్చరంగు కాంతిని దేదీప్యమానంగా విరజిమ్ముతాయి. ఆ అందమైన అనుభూతిని సొంతం చేసుకోవడానికే అనేకమంది ప్లాంట్ లవర్స్ 'లైట్ బయో' సంస్థకి ఆర్డర్లు పెడుతున్నారు. వాళ్లకే ఎందుకూ అంటే... ఆ సంస్థే ఈ మెరిసే పూలమొక్కల సృష్టికర్త కాబట్టి! ఇప్పుడు ప్రీ-ఆర్డర్లతో సతమతమవుతున్న ఆ సంస్థ... ఈ మొక్కల తయారీ కోసం నలభైఏళ్లు కష్టపడిందంటే ఆశ్చర్యంగానే ఉంటుంది.

పొగాకుతో మొదలు పెట్టి...


రసాయనచర్య కారణంగా జీవులు రాత్రుళ్లు కాంతులు విరజిమ్మడాన్ని 'బయోలుమినిసెన్స్' అంటారు. మనకు తెలిసిన మిణుగురులే అందుకు పెద్ద ఉదాహరణ. కొన్నిరకాల సముద్రజీవులు, కీటకాలు, పుట్టగొడుగుల్లాంటివి కూడా ఈ ప్రత్యేక గుణాన్ని కలిగి ఉంటాయి. కానీ మొక్కలకి ఆ శక్తి లేదు. అసలే అందంగా ఉండే పూలమొక్కలకి రాత్రిపూట ఈ మెరుపులు కూడా తోడైతే ఇంకెంత అందంగా ఉంటాయో అని ఆలోచించాడు కేత్‌ఉడ్ అనే శాస్త్రవేత్త. అయితే, ఆ ఆలోచన ఇప్పటిది కాదు... నలభై ఏళ్ల క్రితానిది. మిణుగురుల్లోని మెరుపుకు కారణమైన ఎంజైమ్‌ని తీసుకుని, పొగాకు మొక్కలోకి ప్రవేశపెట్టాడు. అలా మొదటిసారి 'బయోలుమినిసెంట్ టొబాకో' ప్రాణం పోసుకుంది. కానీ ఆ మొక్క మెరవడానికి ప్రత్యేక పోషకాల్ని అందించాల్సి వచ్చేది. అయినా దాని మనుగడ కొనసాగలేదు. అలాంటి సమయంలోనే కేత్‌ఉడ్‌కి 'నియోనోతోపానస్ నంబి' అనే మెరిసే పుట్టగొడుగుల గురించి తెలిసింది. 'జీన్ స్ప్లైసింగ్' పద్ధతిలో పుట్టగొడుగుల నుంచి ఆ జన్యువుని సేకరించి, పెటూనియా మొక్కల్లో ప్రవేశపెట్టాడు. ఈ ప్రయోగం విజయవంతమై, పెటూనియాలు మెరవడం మొదలుపెట్టాయి. అది కూడా ఇతర బయోలుమినిసెంట్ జీవుల్లా ఆగి, ఆగి మెరవడం కాకుండా పున్నమి వెన్నెల్లా హాయిగా వెలుగుతున్నాయి. వీటికి ప్రత్యేక పోషకాల అవసరం లేదు, సాధారణ మట్టే చాలు. ఈ మెరిసే మొక్కలని ప్రత్యేకంగా సాగు చేయాలన్న ఉద్దేశంతో 2019లో 'లైట్ బయో' అనే స్టార్టప్‌ని మొదలుపెట్టాడు.

అమెరికా ప్రభుత్వం కూడా వీటితో పర్యావరణానికి ఏ హానీ ఉండదని తేల్చుకున్నాకే అనుమతులు ఇచ్చింది. 'ఇదొక జెనెటిక్ ఇంజినీరింగ్ అద్భుతం' అంటూ టైమ్ పత్రిక ప్రశంసించింది. లైట్ బయో సంస్థ టిష్యూకల్చర్ పద్ధతిలో పెద్దఎత్తున ఈ మొక్కల్ని పెంచి, అమ్మకాలూ మొదలుపెట్టింది. గత ఏడాది నుంచి ఇప్పటివరకూ కొన్ని లక్షల మొక్కలు అమ్ముడుపోయాయి. త్వరలో మెరిసే చామంతులు, ఆర్కిడ్లు వంటి పూలమొక్కలనీ మార్కెట్లోకి తీసుకొస్తుందట ఈ సంస్థ. వీటితో ఇంటికీ, తోటలకీ కొత్త అందాల్ని తీసుకురావొచ్చు... నైట్ గార్డెన్లని అభివృద్ధి చేయొచ్చు, ఆకర్షించే ల్యాండ్‌స్కేపులనీ రూపొందించొచ్చని ప్రభుత్వాలూ, ప్రైవేట్ సంస్థలూ ఆలోచిస్తున్నాయి. మరోపక్క కృత్రిమ కాంతితో ఎదురయ్యే అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చని నిపుణులు అంటున్నారు. మీకూ ఈ మొక్కని కొనుక్కోవాలని ఉందా... అమెజాన్, ఇట్సీ వంటి సంస్థలు ఆన్‌లైన్లో అందిస్తున్నాయి.. ఒక ఆర్డర్ పెట్టుకుంటే సరి. ★












జ్ఞానదంతాలకు... బ్యాంకులు!

జ్ఞానదంతం... దీన్నే విజ్డమ్ టూత్ అనీ, థర్డ్ మోలర్ అనీ అంటారు. అది కొత్తగా వచ్చినప్పుడు... ఆ బాధ ఎలా ఉంటుందో చాలామందికి అనుభవమే! ఆ నొప్పి భరించలేకే కొందరు ఈ దంతాన్ని తీసేయిస్తుంటారు కూడా. ఒక్క అమెరికాలోనే ఏటా కోటిమంది ఈ విజ్డమ్‌టూత్ ఆపరేషన్లు చేయించుకుంటున్నారట. ఇంతవరకూ ఈ దంతాలని ఎందుకూ పనికిరాని 'బయొలాజికల్ వేస్ట్'గానే భావిస్తూ వచ్చారు. కానీ, స్పెయిన్‌లోని బాస్క్‌కంట్రీ శాస్త్రవేత్తలు మాత్రం ఈ జ్ఞానదంతాలపైన పరిశోధనలు చేసి వీటిని 'మెడికల్ గోల్డ్'గా తేల్చారు. అవును, వ్యాధుల నివారణలో మూలకణాలు ఎంతగా ఉపయోగపడతాయో, అంతకు మించి అనేక ప్రయోజనాలని ఈ జ్ఞానదంతాలు అందిస్తాయట. ఈ దంతాల్లో దాగిన 'డెంటల్ పల్ప్' అనే శక్తిమంతమైన పదార్థంతో మెదడు, గుండె, ఎముకలకి సంబంధించిన కణజాలాన్ని తయారుచేసి వాటితో గుండె జబ్బులూ, క్యాన్సర్లూ, వెన్నెముక గాయాలని నయం చేయొచ్చనీ- అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి వ్యాధుల నుంచీ ఉపశమనం పొందొచ్చనీ పరిశోధకులు అంటున్నారు. ఈ దంతాలని పారేయకుండా దాచుకొమ్మని సలహా ఇస్తున్నారు. దాంతో అమెరికా వంటి చోట్ల స్టెమ్‌ఓడాంటిక్స్ సహా మరికొన్ని సంస్థలు ఈ దంతాలకి బయోలాజికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కూడా కల్పిస్తున్నాయి.

కృత్రిమకాంతితో చిక్కే...



పగలు పనిచేయడం, రాత్రుళ్లు విశ్రాంతి తీసుకోవడం సాధారణంగా మనమంతా చేసేపని. దీనికనుగుణంగా శరీరం స్పందించే విధానాన్ని 'సర్కాడియన్ రిథమ్' అంటారు. దీనికి వ్యతిరేకంగా రాత్రుళ్లు విశ్రాంతి తీసుకోకుండా, కృత్రిమ కాంతిలో పనిచేస్తే ఏమవుతుంది? కృత్రిమకాంతి మన శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది... అనే దిశగా వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. రాత్రిపూట నిద్రపోకుండా కృతిమకాంతిలో పనిచేయడం అనేది కేవలం నిద్రలేమిని మాత్రమే కలిగించదట... ఇది మన వ్యాధినిరోధక వ్యవస్థ మొత్తాన్నీ దెబ్బతీయడమే కాకుండా కొన్ని రకాల అంతర్గతవాపులకు కూడా కారణం అవుతుందని అంటున్నారు. కృత్రిమకాంతిలో- మరీ ముఖ్యంగా తీవ్రమైన కాంతిలో ఎక్కువసేపు గడిపేవారిలో వ్యాధినిరోధక శక్తి తగ్గి ఇన్‌ఫెక్షన్ల బారినపడుతుంటారట. అలాగే ఒత్తిడీ, ఆందోళనా, కుంగుబాటూ వంటి సమస్యలుంటే వాటిని పెంచే గుణం కూడా ఈ కృత్రిమకాంతికి ఉందని పరిశోధనల్లో తేలింది. అలాగే, అధిక సమయం కృత్రిమకాంతిలో గడిపేవారిలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడే అవకాశం కూడా ఉందని అంటున్నారు. పగటిపూట సహజ కాంతితో పోలిస్తే కృత్రిమకాంతికి ఉండే వేవ్‌లెంగ్త్ వేరుగా ఉండటమే దీనికి కారణమట. కొన్ని రంగాల్లో పనిచేసేవారు తప్పనిసరై రాత్రిపూట పనిచేయాల్సి ఉంటుంది. అలాంటి వారు తలకి నీలిరంగు క్యాప్‌లాంటిదాన్ని ధరించడం ద్వారా కృత్రిమ కాంతి తీవ్రతని కొంతవరకూ తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు సలహా ఇస్తున్నారు.

పరి శోధన

అలా చేస్తే క్యాన్సర్ రాదు...

క్యాన్సర్ వంటి వ్యాధులు ఏ కారణంతో వస్తాయో తెలియదు, ఒక వేళ వస్తే దాన్నుంచి బయటపడేందుకు పెద్ద పోరాటమే చేయాలి. అలాకాకుండా... ఓ చిట్కా పాటిస్తే క్యాన్సర్ రిస్క్‌ని 16 శాతం తగ్గించుకోవచ్చట. ఇదేదో బాగుందే, ఏంటా నియమం అంటారా... మనందరికీ తెలిసిందే.... నడక! అవును, రోజులో తొమ్మిదివేల అడుగులు వేసేవారు క్యాన్సర్ భయాన్ని 16 శాతం తగ్గించుకోవచ్చని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, యూఎస్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌ల సంయుక్త పరిశోధనలో తేలింది. 84000 మందిపైన ఆరేళ్లపాటు సాగిన ఈ పరిశోధనలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. నిజానికి ఎంత నడిచినా మంచిదే... కానీ ఏడువేలూ, ఆపైన నడిచేవారిలో క్యాన్సర్ భయం తక్కువగా ఉంటుందని ఈ పరిశోధనలో తేలింది. తొమ్మిదివేల అడుగులు అంటే సుమారుగా ఆరేడు కిలోమీటర్లు... ఇంత దూరం నడవడానికి గంటన్నర సమయం పడుతుంది. రోజులో గంటన్నర లేదంటే, వారంలో ఐదు నుంచి ఆరుగంటలు నడకకోసం కేటాయిస్తే మెరుగైన ఫలితాలు అందుకోవచ్చనీ, ఇలా నడవడం వల్ల ట్యూమర్ల పెరుగుదల నియంత్రణలో ఉంటుందనీ శాస్త్రవేత్తలు అంటున్నారు.





వ్యాధులని గుర్తించే టాటూలు!

శరీరంలో ఏవైనా ఇన్‌ఫెక్షన్లు దాగి ఉంటే, వాటి లక్షణాలు బయటపడేదాకా మనం వాటిని గుర్తించలేము. ఇలా లక్షణాలు బయట పడేంతవరకూ ఆగేకన్నా ముందే గుర్తిస్తే అనారోగ్యాల నుంచి తేలిగ్గా బయటపడొచ్చు అంటున్నారు హార్వర్డ్, ఎమ్ఐటీ శాస్త్రవేత్తలు. ఇందుకోసం వ్యాధులని ముందే గుర్తించడానికి వీలుగా ప్రత్యేకమైన టాటూలని ఆవిష్కరించారు. టాటూలతో వ్యాధులని గుర్తించడమేమిటని ఆశ్చర్యంగా ఉందా... ఇవి పేరుకే టాటూలు కానీ... నిజానికి ఇవి ఈ-కొలి అనే బ్యాక్టీరియాలో మార్పులు చేసి, శరీరానికి ఏమాత్రం హానిచేయని హైడ్రోజెల్‌తో తయారుచేసిన బయోసెన్సార్లు. అందుకే వీటిని 'లివింగ్ టాటూ'లు అని అంటున్నారు. ఈ టాటూని శరీరంపైన వేసుకున్నప్పుడు రక్తం లేదా చెమటద్వారా ఇతర బ్యాక్టీరియాని గుర్తించి ఇందులోఉన్న బ్యాక్టీరియా నీలిరంగులోకి మారతాయట. యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్లు, సెప్సిస్, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు వస్తే ఈ ప్యాచ్‌లు ముందుగానే సమస్యను గుర్తించి మనకు హెచ్చరికలు జారీ చేస్తాయట.



రావమ్మా... వరలక్ష్మీ రావమ్మా!

పరదేవత వరలక్ష్మి... శ్రావణ శుక్రవారం ఘల్లుఘల్లుమని అడుగులేస్తూ మన గడపలో అడుగుపెడుతుంది. 'స్వాగతం... సుస్వాగతం' అంటూ మనం సాదరంగా ఆహ్వానించడమే ఆలస్యం... పూజాపీఠాన్ని అలంకరించి, షోడశోపచారాలు అందుకుంటుంది. అష్టోత్తర శతనామాలు ఆలకించి, భక్ష్యభోజ్య నైవేద్యాలు ఆరగిస్తుంది. తాంబూలం స్వీకరించి తిరుగుప్రయాణానికి సిద్ధం అవుతుంది. కానీ, మనం వెళ్లనివ్వకూడదు. 'నట్టింట్లో పద్మాసనం వేసుకుని కూర్చోవమ్మా!' అంటూ ఆ పద్మావతిని ప్రార్థించాలి. శాశ్వతంగా కుటుంబ సభ్యురాలిని చేసుకోవాలి. అప్పుడే, మన ఇల్లు లక్ష్మీ నివాసం. అదే వరలక్ష్మీ కటాక్షం!

శ్రీ...

లక్ష్మి..

మహాలక్ష్మి...

దేవతలు ఆ తేజోరాశికి చేతులెత్తి మొక్కుతున్నారు. అసురులు ఆ సౌందర్యరాశిని నోరెళ్లబెట్టి చూస్తున్నారు. పద్మాక్షి, పద్మప్రియ, పద్మగంధి... క్షీరసాగర మథనంలో పద్మాసన ముద్రలో సాక్షాత్కరించింది. దేవకాంతలు... ఆ మంగళ స్వరూపిణికి మంగళ స్నానాలు చేయించారు, ఆ నిత్య సౌభాగ్యవతికి పసుపుకుంకుమలు సమర్పించారు, ఆ హిరణ్యవర్ణకు స్వర్ణాభరణాలు అలంకరించారు. ఆ చక్కదనాల చుక్కకు దిష్టిచుక్క పెట్టారు. చుట్టూ ఉన్న వారిని చిరునవ్వుతోనే పరామర్శించి... కలువల హారంతో స్వయంవరానికి బయల్దేరింది క్షీరాబ్ధి కన్యక.

అందర్నీ గమనించుకుంటూ ముందుకు సాగుతోంది ఇందిర. నాలుగు తలల వారొకరూ మూడు కళ్ల వారొకరూ, నిప్పుల కొలిమి ఒకరూ నిలకడలేని స్వభావి ఒకరూ ... ఇలా ఎవరిని చూసినా ఏదో ఓ లోపం. అంతలోనే సిరి దృష్టి హరి వైపు మళ్లింది. వంకపెట్టలేని వ్యక్తిత్వం. కామక్రోధాలకు అతీతమైన పరిపూర్ణత్వం. అంతే, అక్కడితో ఆమె అన్వేషణ పూర్తయిపోయింది.

సాధు రక్షకుండు షడ్వర్గ రహితుండు
నాథుడయ్యెనేని నడప నోపు
నితడె భర్త యనుచు నింతి సరోజాక్షున్
పుష్ప దామకమున బూజసేసె...

క్షణమైనా ఆలస్యం చేయకుండా, చేతిలోని పూదండను పురుషోత్తముడి మెడలో అలంకరించింది. పడతి ప్రతిపాదనకు కళ్లతోనే ఆమోదం తెలిపాడు అరవిందాక్షుడు.

హృదయ పూర్వకంగా జీవితంలోకి ఆహ్వానించి, హృదయంలో చోటిచ్చాడు. అయినా, ఆ ఇద్దరి అనుబంధం ఇప్పటిదా? మన్వంతరాల నాటిది!

యుగాల బంధం

భృగు... బ్రహ్మ మానసపుత్రుడు. అతని ఇల్లాలి పేరు ఖ్యాతి. పరాశక్తి కటాక్షం కోసం ఆ మహర్షి కఠోరమైన సాధన చేశాడు. ఆ సంకల్పానికి మెచ్చి జగజ్జనని ప్రత్యక్షమైంది. 'నీలోని వైభవ కళను పుత్రికగా మాకు ప్రసాదించు తల్లీ' అని వేడుకున్నాడు భృగు. అమ్మ అనుగ్రహించింది. అలా, ఆ ఇంట భార్గవిగా జన్మించింది శ్రీలక్ష్మి. అదే సమయానికి, నారాయణుడు విశ్వ శ్రేయస్సు కోసం తపోభూమికి బయల్దేరాడు. ఆ సంగతి తెలిసిన ఇంద్రుడు, విఘ్నాలను సృష్టించి రమ్మంటూ అప్సరసలను పురమాయించాడు. అయినా, పురుషోత్తముడు చలించలేదు. విశ్వరూప దర్శనమిచ్చి తానేమిటో వారికి చాటిచెప్పాడు. ఆ విషయం భార్గవికి తెలిసింది. అప్పటి నుంచీ ఆ విరాట్ మూర్తిని తన పెనిమిటిగా ఊహించుకుంది. స్వామి కోసం తపస్సు చేసింది. ఆమె సంకల్పానికి ముచ్చటపడిన విష్ణుమూర్తి... ఆ లక్ష్మీ అంశను తన జీవన సహచరిగా స్వీకరించాడు. అతను నిరంతరుడైతే, ఆమె నిత్యానపాయిని. ప్రతి అవతారంలోనూ భర్తను అనుసరిస్తూనే ఉంటుంది. మత్స్యావతారంలో శ్రియగా, కూర్మావతారంలో కూర్మవతిగా, వరాహావతారంలో భూలక్ష్మిగా, నరసింహావతారంలో శ్రీలక్ష్మిగా, పరశురామావతారంలో రేవతిగా, రామావతారంలో సీతగా, కృష్ణావతారంలో రుక్మిణిగా... స్వామి కోసమే అవతరించింది. వామనావతారంలో కృష్ణాజినంగా మారి, వటుడి రూపంలోని విష్ణువుతోపాటు బలి చక్రవర్తి సభకు వెళ్లింది. ఎక్కడా, ఏ చిన్న ఎడబాటునూ తట్టుకోలేదామె. అయినా కొన్నిసార్లు వేరుపడక తప్పలేదు. అదీ లోక కల్యాణం కోసమే. ఒకానొక సమయంలో.... శ్రీమహావిష్ణువు తనకు ప్రసాదించిన నిర్మాల్య హారాన్ని ఐరావతం మీద ఊరేగుతున్న దేవరాజుకు అందించాడు దూర్వాస మహర్షి. ఇంద్రుడు ఆ దండను కళ్లకైనా అద్దుకోకుండా, ఐరావతం మెడలో వేశాడు. తెల్ల ఏనుగు... తన సహజ ప్రవృత్తి కొద్దీ తొండంతో విసిరికొట్టింది. దీంతో మహర్షి కోపం కట్టలు తెంచుకుంది. 'ఇంద్రా! అంతులేని సంపదల్ని చూసుకునే కదా ఈ మిడిసిపాటు. ఆ ఐశ్వర్యాలకు మూలం సముద్రం పాలైపోతుంది' అని శపించాడు. ఆ కారణంగానే లక్ష్మీదేవి... కొంతకాలం అనంత జలనిధిని ఆశ్రయించింది. సురాసురుల క్షీరసాగర మథనంలో మళ్లీ బయటికొచ్చింది. లోక కల్యాణ కారకుడిని వరుడిగా ఎంచుకుంది.

సూర్యస్య రశ్మయో యద్వృతః
ఊర్మయో అంబుధేరివ
సర్వైశ్వర్య ప్రభావేన...
కమలా శ్రీపతే తథా!

ఆ ఇద్దరిదీ... సూర్యుడికీ, కిరణాలకూ ఉన్న సంబంధం. సముద్రానికీ అలలకూ ఉన్న అనుబంధం. పేరుకు సత్యనారాయణ స్వామి వ్రతమే అయినా.... రమా సమేతుడిగానే ఆయన పూజలు అందుకుంటాడు. శ్రావణంలో మనం జరుపుకునేది వరలక్ష్మీ వ్రతమే అయినా... శ్రీమన్నారాయణుడితో కలిసే కలశంలో కొలువుదీరుతుంది నారాయణి. ఆమాటకొస్తే, మహావిష్ణువు మాత్రం శ్రీలక్ష్మిని విడిచిపెట్టి ఉండగలడా? అందులోనూ ఆమెకు



'చంచల' అనిపేరు. ఎవరినీ ఎల్లకాలమూ ఆశ్రయించి ఉండదనే ప్రచారమూ ఉంది. ఆ భయంతోనే తన గుండెల్లో చోటిచ్చి, కమలాక్షిని కట్టడి చేశాడనీ అంటారు. పురాణాలు మహావిష్ణువును 'నిత్య శ్రీ' అని పిలుస్తాయి. ఆ శ్రీపతి శిష్ట రక్షణకైనా, దుష్ట శిక్షణకైనా శ్రీమతితో కలిసి వెళ్లాల్సిందే. గజేంద్రుడిని రక్షించడానికి 'సిరికిన్ జెప్పక...' బయల్దేరినమాట నిజమే అయినా, ఆ తొందరలోనూ ఇల్లాలి కొంగును వదిలిపెట్టలేదు. 'మరీ ఇంత ప్రేమా! శ్రీకుచోపరి చేలాంచలమైన వీడడు' అని ముక్కున వేలేసుకున్నారట ముక్కోటి దేవతలూ! ఆ ఇద్దరి అన్యోన్యతా ఓ దాంపత్య పాఠం. సత్యకాలానికి ముందు నుంచీ వాళ్లు నిత్య ప్రేమికులే. కాబట్టే, అమ్మవారిని 'ఈశానాం జగతోస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం..' అని కొనియాడుతుంది వేంకటేశ్వర ప్రపత్తి.

సిరి స్వభావం

ఆ శ్రీమంతురాలు సున్నిత మనస్కురాలు. లక్ష్మీ కటాక్షాన్ని పొందాలంటే, ముందుగా లక్ష్మీ స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. ఆమె ఇష్టాయిష్టాల్ని గ్రహించాలి. మహాభారతంలోని శాంతిపర్వంలో ధర్మరాజు 'మహాలక్ష్మి ఎక్కడెక్కడ కొలువై ఉంటుంది పితామహా?' అని అడుగుతాడు అంపశయ్య మీద ఉన్న భీష్ముడిని. 'పచ్చని పొలంలో, పారే నీటిలో, పసుపు పూసిన గడపలో, స్వచ్ఛమైన చిరునవ్వులో, అతిథి అభ్యాగతులతో కళకళలాడే నివాసాల్లో, పరిశుభ్రతలో, సత్యంలో, దానంలో, ధర్మంలో... ' అని లోతుగా వివరిస్తాడు ఆచార్యుడు. 'నిత్యసత్యులు, శౌచనిరతులు, అమలమతులు...' అంటూ అమ్మకు నచ్చే సద్గుణాలనూ వినిపిస్తాడు.

శ్రీలక్ష్మి శాంతిప్రియ. తాను కొలువైన చోట ఆనందాలు వెల్లివిరియాలని కోరుకుంటుంది. ఆమె లక్ష్యానికి అధిదేవత కూడా. దీపలక్ష్మిగా అజ్ఞాన తిమిరాన్ని ఛేదించి, జ్ఞాన సాధనకు మార్గం సుగమం చేస్తుంది. కాబట్టే, చీకటికి ప్రతీక అయిన గుడ్లగూబను ఏరికోరి వాహనంగా ఎంచుకుంది. తనకు పచ్చదనమంటే ప్రాణం. వనలక్ష్మిగా, వృక్షలక్ష్మిగా ఆమెను అర్చిస్తారు భక్తులు. ప్రకృత్యై నమః... అంటూ చేతులు జోడిస్తుంది శాస్త్రం. నాలుగు మొక్కలు ఉన్న చోటికి, బొట్టుపెట్టి పిలవకపోయినా వెళ్లిపోతుందామె. సిరిలక్ష్మికి గృహలక్ష్మి పట్ల మహా మక్కువ. ఇల్లాలి చిరునవ్వులోనూ తానుంటానని... స్కాంద పురాణంలో ప్రకటించింది. అంతేనా... ఆప్యాయంగా మాట్లాడేవారూ, పెద్దల్ని సేవించేవారూ తన అభిమానానికి పాత్రులు అవుతారని వెల్లడించింది. వినయ సంపన్నుల్ని చూస్తే అమ్మవారికి మహా ముచ్చట. 'నా బిడ్డ బంగారం!' అని మురిసిపోతుంది. పాలు, పెరుగు, పసుపు, కుంకుమ, పూలు... లక్ష్మీ నివాసాలని కూడా నిర్ధారించింది. అశాంతినీ, అసంతృప్తినీ ఆమె ఇష్టపడదు. వ్యాజ్యాలూ, వివాదాలూ తనకు గిట్టవు. వ్యసనపరుల నీడనైనా భరించలేదు. క్రూర స్వభావులనూ, కఠినాత్ములనూ ఆమడదూరంలో ఉంచుతుంది. సోమరులను ప్రేమించదు. స్వార్థపరులను ప్రోత్సహించదు. అతినిద్రాపరులను ఆదరించదు. ఆయా లోపాల్ని సరిదిద్దడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది. అవసరమైతే, తన అక్క జ్యేష్ఠాదేవిని పురమాయించి కాస్త కఠినంగానే బతుకు పాఠాలు నేర్పుతుంది. అలా అని, తనకు కోపతాపాలు తెలియవు. మదినిండా మాతృత్వ మమకారమే. బిడ్డల్ని మంచివైపు మళ్లించి, మళ్లీ సిరిసంపదల్ని ప్రసాదించడానికే ఆ ప్రయత్నమంతా.

లక్ష్మీకటాక్షం!

'సౌభాగ్యలక్ష్మీ ఉపనిషత్'లో విష్ణుమూర్తి సిరిదేవత ఉపాసనా మార్గాన్ని బోధిస్తూ... 'మీకోసం మీరు ఏ కోరికలూ కోరుకోవద్దు. నలుగురికీ మంచి జరగాలని ప్రార్థించండి చాలు. అప్పుడే, మీకూ సంపదలు సిద్ధిస్తాయి' అంటూ ఓ పరమ రహస్యాన్ని చెబుతాడు. ఆ మాటా నిజమే. తెలుగింటి అన్నపూర్ణమ్మ... డొక్కా సీతమ్మ గురించి తెలియనివారు ఉండరు. ఆ దొడ్డ ఇల్లాలు నిత్యాన్న సేవలో ఉన్న ఆస్తులన్నీ పోగొట్టుకున్నారు. ఓ దశకు వచ్చేసరికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి. మరుసటి రోజు అన్నార్తుల ఆకలి ఎలా తీర్చాలా... అని ఆలోచిస్తూ కూరగాయల కోసం పాదులు చేస్తుంటే, నిధి నిక్షేపాలు దొరికాయట. ఇంకెప్పుడూ, డబ్బు కోసం తడుముకోవాల్సిన అవసరమే రాలేదట. అంతెందుకు, ఏటా ఫోర్బ్స్ పత్రిక విశ్వసంపన్నుల జాబితాను విడుదల చేస్తుందా? అందులో, తొలి పది స్థానాల్లో ఒకరిద్దరైనా మహాదాతలు ఉంటారు. కోట్లకొద్దీ సొమ్మును సేవకు కేటాయించినా, వాళ్ల ఖజానా ఎప్పుడూ నిండుకోదు. పంచుకున్న ప్రతిసారీ ఎంతోకొంత పెరుగుతూనే పోతుంది. కుబేరుల చిట్టాలో స్థానమూ పదిలంగా ఉంటుంది. దీన్నే లక్ష్మీకటాక్షం అంటారు!

కనకధార...

వరలక్ష్మి విధిని ధిక్కరించగల శక్తిమంతురాలు. తలరాతలు మార్చగల సమర్థురాలు. 'బ్రహ్మదేవుడు ఇతణ్ని పేదవాడిగా పుట్టించాడు. పేదరికంలోనే బతకమని శాసించాడు. ఆ రాతను నువ్వు కాలి గోటితో తుడిచేయగలవు తల్లీ!' అంటూ కనకధారాస్తవంలో లక్ష్మీదేవిని కొనియాడతారు ఆదిశంకరులు. ఆ వాక్యాలు అక్షర సత్యాలు. కాబట్టే, పరమ దరిద్రుడి పూరిగుడిసె మీద బంగారు ఉసిరికాయల వర్షం కురిపించిందా

పరదేవత. నల్లధనమై నేలమాళిగలో మగ్గిపొమ్మనో... దొంగసొత్తుగా విదేశాలకు తరలిపొమ్మనో షరతులు పెడితే మాత్రం భాగ్యలక్ష్మి అస్సలు ఒప్పుకోదు. కళ్లెర్రజేసి కటకటాలకు పంపుతుంది. 'కమలవాసినీ! నా హృదయాన్ని కమలంలా భావించి... అందులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవమ్మా!' అని ఆర్తితో అర్థించాలి. ఏ దశలోనూ, ఇంద్రుడిలా ఐశ్వర్యకాంక్షను నెత్తికి ఎక్కించుకోకూడదు. పూర్వం జంభాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. అతను మహా బలవంతుడు. అనేక యుద్ధాల్లో దేవతల్ని చిత్తుగా ఓడించాడు. దీంతో, ముక్కోటి దేవతలూ దత్త స్వరూపంలో లక్ష్మీ సమేతంగా కొలువుదీరిన నారాయణుడిని ఆశ్రయించారు. కాపాడమని వేడుకున్నారు. హరి అభయమిచ్చి పంపాడు. ఆ అసురుడిని యుద్ధానికి ఉసిగొల్పి, తన వద్దకు తీసుకురమ్మని సలహా ఇచ్చాడు. విష్ణుమూర్తి 'అనఘుడు' (లోపరహితుడు) అయినప్పుడు, లక్ష్మీదేవి మాత్రం 'అనఘ' కాకుండా పోతుందా? అసుర సంహారం కోసం ఆమె అనఘాదేవిగా అవతరించింది. దేవతల్ని తరుముతూ వచ్చిన జంభాసురుడు అనఘాదేవిని కాముకదృష్టితో చూశాడు. బలవంతంగా ఓ బుట్టలో కూర్చోబెట్టి, నెత్తిన మోసుకుని బయల్దేరాడు. సిరి నెత్తినెక్కగానే.. ఎంతటివారిలో అయినా బలం, తేజస్సు క్షీణించిపోతాయి. జంభుడి విషయంలోనూ అదే జరిగింది. మునుపటి శక్తి మాయమైపోయింది. భూలక్ష్మి బరువును మోయలేక గంపను దించేశాడు. అదే అవకాశంగా, ఆ రాక్షసుడిని ఒక్క దెబ్బకు నేలకూల్చారు దేవతలు. మహా సంపన్నులమని అహంకరించేవారూ, వక్రమార్గాల్లో సంపాదించేవారూ, వ్యసనాలతో పెద్దల ఆస్తుల్ని కరిగించేవారూ... ఆమె దృష్టిలో జంభాసురులే. అలాంటి వ్యక్తిత్వ లోపాల్ని తీవ్రంగా పరిగణిస్తుంది.

లక్ష్మీదేవి అభిమానవతి. తనకు గౌరవం లభించని చోట ఒక్క క్షణమైనా ఉండదు. అది తన మెట్టినిల్లు వైకుంఠమైనా సరే. ఓ సందర్భంలో భృగు మహర్షి... తన నిజ నివాసమైన విష్ణుమూర్తి హృదయ స్థానాన్ని కాలితో తన్నడంతో ఆమె మనసు చివుక్కుమంది. కన్నీళ్లు పెట్టుకుంటూ కొల్హాపురానికి ప్రయాణమైంది. దీంతో సిరిలేని వైకుంఠం చిన్నబోయింది. లక్ష్మిని కోల్పోయిన నారాయణుడు తేజస్సును కోల్పోయాడు. శ్రీ అంటే సంపదే కాదు... భాగ్యం, విజయం, వైభవం, తేజస్సు కూడా.

వరలక్ష్మీ స్వరూపం

శ్రీసూక్తం వర్ణించిన ఆరు లక్ష్మీ స్వరూపాల్లో... అత్యున్నతమైంది వరలక్ష్మి రూపం. అనేక పురాణాల్లో వరలక్ష్మీ వ్రతం ప్రస్తావన కనిపిస్తుంది. సాక్షాత్తు పరమశివుడే పార్వతీదేవికి ఆ ప్రాశస్త్యాన్ని వివరించిన ఘట్టాలూ ఉన్నాయి. వరలక్ష్మీ వ్రతకథ ప్రకారం... చారుమతి అనే ఇల్లాలికి శ్రీమహాలక్ష్మి కలలో కనిపించి, తనను అర్చించే విధానాన్ని బోధిస్తుంది. ఆ గృహిణి వేదాలను చదువుకోలేదు. తపస్సులూ చేయలేదు. అయితేనేం, అతిథి సత్కారంలో అన్నపూర్ణమ్మ. అత్తమామలను గౌరవించేది. భర్తను ప్రేమించేది. పిల్లల్ని రత్నాలూ మాణిక్యాల్లా తీర్చిదిద్దేది. ఇంటిని అద్దంలా ఉంచుకునేది. నలుగురికీ చేతనైనంత సాయం చేసేది. అమ్మకు నచ్చే అతిగొప్ప గుణం... భూతదయ. అంతకు మించిన ఆధ్యాత్మిక సాధన లేదు కాబట్టే, చారుమతిని తన ప్రతినిధిగా ఎంచుకుంది. 'నువ్వు నిలువెత్తు దయాస్వరూపానివి తల్లీ' అంటూ శ్రీలక్ష్మిని కీర్తిస్తారు వేదాంత దేశికులు తన 'దయాస్తోత్రం'లో.

పూజాదికాల్లో మనం పారాయణం చేసే... అష్టోత్తర శతనామాలు లక్ష్మీతత్త్వానికి శతాధిక కోణాలు. విద్యాయై నమః - ఆమె చదువులకు మూలం. శ్రద్ధాయై నమః - శ్రద్ధాగుణంలో ఆ తల్లి అంశ అంతర్లీనం. శుచయే నమః - శుభ్రత లక్ష్మీ స్వరూపం. కరుణాయై నమః - కారుణ్యం కరుణశ్రీ సహజగుణం. సత్యై నమః - ఆమె సాక్షాత్తూ సత్య స్వరూపిణి. శుభాయై నమః - శుభాలు లక్ష్మీ కటాక్షాలు. జయాయై నమః - తను విజయ ప్రదాత కూడా. వ్రతాలూ నోముల సందర్భంగా మగువలు చేసుకునే ముస్తాబులోనూ తానుంటానని వెల్లడించింది అమ్మ. ఆ అలంకరణ సమయంలో ఆడపిల్లలు తమలో తాము లక్ష్మీదేవిని చూసుకుంటారట! 'మమ రూపాసి దేవిత్వం... న భేదోస్తి త్వయామయి' అంటూ అమ్మవారి తరఫున ఆ విషయాన్ని వెల్లడిస్తుంది శుభాగమ పంచకం. ఆధ్యాత్మిక సాధనలో ఇది 'సారూప్య మార్గం'.

★ ★ ★

ఓసారి, శ్రీరంగంలో వెలసిన రంగనాయకి అమ్మవారి వజ్రాల ముక్కెర కనిపించకుండా పోయింది. బోసిపోతున్న ఆ నాసికం వైపు చూసి భయపడిపోయారు అర్చకులు. అంతలోనే అశరీరవాణి, తంజావూరు ప్రభువుల అన్నదాన సత్రంలో ఆ నగ ఉందని చెప్పింది. వెంటనే అధికారులు బయల్దేరి వెళ్లారు. పాలకుడు విజయరాఘవుడిని కలిసి అంతా వివరించారు. ఆయన అనుమతితో అణువణువూ గాలించారు. మొత్తానికి, ఓ పొయ్యి పక్కన కుప్పగా పోసిన బూడిదలో దొరికిందా వజ్రాభరణం. తీరా విచారిస్తే... రోజూవచ్చే వంటలమ్మ అనారోగ్యం వల్ల కొద్దికాలంగా గైరుహాజరు అవుతోందనీ, ఆమె స్థానంలో వంటపనికి వస్తున్న ఓ ముసలి ముత్తయిదువ ఆ ముక్కెర పెట్టుకునేదనీ అక్కడి సిబ్బంది తెలిపారు. అంటే, ప్రభువుల నిత్యాన్నదాన మహత్కార్యం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగిపోకూడదనే ఉద్దేశంతోనే అమ్మవారు శ్రీరంగం నుంచీ వచ్చి వండివార్చింది. అన్నలక్ష్మిగా పేదల ఆకలి తీర్చింది. అన్నట్టు, నలుగురి కోసం వడ్డించిన విస్తళ్లు కూడా లక్ష్మీ స్వరూపాలే! ★

'అష్ట' గుణాలు

భారతీయ సంప్రదాయం శ్రీమహాలక్ష్మిని అష్టలక్ష్మిగా ఆరాధిస్తుంది. ఎనిమిది రూపాలూ లక్ష్మీతత్త్వానికి ఎనిమిది కోణాలు. లక్ష్మీకటాక్షాన్ని సాధించడానికి ఎనిమిది సోపానాలు కూడా. ఆదిలక్ష్మి... సంకల్ప బలానికి ప్రతీక. విశ్వకుబేరుడి ప్రయాణమైనా ఒక్క రూపాయితోనే మొదలవుతుంది. లక్ష్యాన్ని సాధించగలననే ఆ మనోబలంలో 'ఆదిలక్ష్మి' కొలువై ఉంటుంది. అవరోధాల్ని అధిగమించి కలను నిజం చేసుకోడానికి సాధకుడు సాగించే ప్రయాణంలో 'ధైర్యలక్ష్మి' అండగా నిలుస్తుంది. అలా అని, ఆ ఒక్కటే సరిపోదు, విజయ సాధనకు నైపుణ్యమూ కావాలి. ఆ మేధస్సును 'విద్యాలక్ష్మి' అందిస్తుంది. బలమైన శరీరంలోనే బలమైన మనసు ఉంటుంది. అంతటి సత్తువ ఆహారంతోనే వస్తుంది. 'ధాన్యలక్ష్మి' భోజనం రూపంలో శారీరక దృఢత్వాన్ని ఇస్తుంది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధన సంపత్తితో మనం సాగించే పోరాటం మనల్ని గెలుపు వైపు నడిపిస్తుంది. 'విజయలక్ష్మి' మహాప్రసాదమిది. ఆ అర్హతతో మనదైన రంగంలో, మనకంటూ ఓ సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాం. దానికి అధిదేవత 'గజలక్ష్మి'. ఆమెను సామ్రాజ్య లక్ష్మిగానూ పిలుస్తారు. ఆ వెనువెంటనే 'ధనలక్ష్మి' కరుణిస్తుంది. తదుపరి దశ... విస్తరణ. ఒక ఎకరం నుంచి పది ఎకరాలకూ, ఒక లక్ష నుంచి వెయ్యి లక్షలకూ, ఒక పట్టా నుంచి రెండు పట్టాలకూ... ఒక వ్యక్తి నుంచి ఒక కుటుంబానికి! సంతానలక్ష్మి పిల్లాపాపల్లాంటి కీర్తి వైభోగాల్ని కటాక్షిస్తుంది. బంధు బలగాల్ని సమకూరుస్తుంది. అలా ఎనిమిది దశల్లో మనం జీవిత లక్ష్యాన్ని సాధిస్తాం.





చనిపోయినా బతికున్నట్టే...

ఆయనో సిపాయి. పేరు హర్భజన్ సింగ్. 1968 అక్టోబర్ 11 వరకూ సిక్కిం-చైనా సరిహద్దులోని ‘నాథులా పాస్’లో కాపలాకాస్తుండేవాడు. ఆ రోజు అక్కడ ఏర్పడ్డ భీకర తుపానులో- తన సైన్యాన్ని కాలువ దాటిస్తూ గల్లంతయ్యాడు. మూడురోజుల తర్వాత శవంగా బయటపడ్డ హర్భజన్‌కి సమాధి కట్టారు. భారత సైన్యం అతనికి గౌరవ కెప్టెన్‌గా పదోన్నతి కూడా కల్పించింది. కానీ వింతగా హర్భజన్ సింగ్ రాబోయే శత్రుసైనికుల దాడి గురించీ, ప్రకృతి విపత్తుల గురించీ కలలోకొచ్చి చెబుతున్నాడన్న నమ్మకం అక్కడి సైనికుల్లో ఏర్పడింది. దాంతో ఆయన కోసం గుడికట్టి బాబా హర్భజన్ సింగ్ అని పూజించసాగారు. ఉదయాన్నే సైనిక మర్యాదలతో యూనిఫార్మ్‌నీ బూట్లనీ ఆయన గుడిలోకి తీసుకెళ్లి సైనికులు సెల్యూట్ చేస్తారు. భారత సైన్యం ఇప్పటికీ హర్భజన్ సింగ్‌ని సజీవ సైనికుడిగానే భావిస్తోంది. నెలనెలా జీతం ఇస్తుంది. ప్రతి సెప్టెంబర్‌లో- ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఇరవై రోజులపాటు బాబా హర్భజన్ సింగ్‌కి సెలవులిస్తుంది. ఆ రోజు ముగ్గురు సైనికులు ఆయన యూనిఫార్మ్‌ని తీసుకుని పంజాబ్‌కి వెళతారు. ఆయన కోసం రైల్లో ఓ బెర్తునీ ఖాళీగానే ఉంచుతారు. పంజాబ్‌లోని కపుర్తలా వెళ్లి అక్కడున్న హర్భజన్‌సింగ్ వాళ్లమ్మకి ఆయన యూనిఫార్మ్‌ని అందించి... 20వ రోజు లాంఛనంగా మళ్లీ ఆఫీసుకు తీసుకొస్తారు. వింతగా ఉంది కదూ!





కలెక్టరమ్మని బడికి రప్పించాడు!

ఓ ప్రభుత్వ బడికి మామూలుగా డీఈఓ వస్తేనే టీచర్లందరూ అటెన్షన్‌లోకి వస్తారు. అలాంటిది ఏ ముందస్తు సమాచారం లేకుండానే ఆ హైస్కూలుకి ఏకంగా జిల్లా కలెక్టర్ వచ్చారు. ఆమెని చూసి పరుగు పరుగున వచ్చిన హెడ్మాస్టర్‌తో ‘పదో తరగతిలో విజయ్ అనే విద్యార్థిని చూడాలి’ అన్నారు. ఆయన దారి చూపుతుండగా ఆ క్లాసుకెళ్లి ‘ఇక్కడ ఎవరు విజయ్?’ అని అడగ్గానే ఆ అబ్బాయి మెల్లగా ముందుకొచ్చాడు.‘నువ్వేనా?! నీ లేఖ చాలా బావుంది’ అంటూ అతణ్ణి ప్రశంసించారు కలెక్టర్ దుర్గ. విద్యార్థులతోపాటూ తానూ క్లాసులో కూర్చుని సరదాగా వాళ్లతో మాటలు కలిపారు. టీచర్లందరూ అటెన్షన్‌లో కొయ్యబారిపోయి నిల్చుంటే... పిల్లలు మాత్రం ఆమెని ‘ఐఏఎస్ ఎలా కావాలి? ఎన్ని గంటలు చదవాలి?’ అంటూ ప్రశ్నల్లో ముంచెత్తారు. తమిళనాడులోని నామక్కల్ జిల్లాలో చోటుచేసుకుందీ ఘటన. ఇంతకీ విజయ్ రాసిన లేఖలో ఏముందంటారా... ‘మేడమ్! మీరు పెళ్లై పాపపుట్టాక ఎంతో కష్టపడి చదివి ఉన్నతాధికారి అయ్యారని చదివాను. మీరు మా బడికొస్తే మాకెంతో స్ఫూర్తిగా ఉంటుంది’ అని!

అవీ ఇవీ



కోట్ల రూపాయల కారు... వేలాడదీశాడు!

దుబాయ్... విలాసాల నగరం. ఇళ్ళన్నీ యజమానుల సిరిసంపదల్ని ప్రతిబింబించేలా ఆడంబరాలతో తులతూగుతుంటాయి. చిన్నపిల్లలు ఆడుకోవడానికి బొమ్మ కారుకొన్నట్టు అక్కడ చాలామంది కస్టమైజ్డ్ రోల్స్‌రాయిస్ కార్లని కొనడం పరిపాటి. అలాంటి ఓ యజమాని ఈ మధ్య కొత్త జెట్ కారు ఒకటి కొన్నాడు. జెట్‌కారంటే రోడ్డుపైన కాకుండా నీళ్లపైన దూసుకెళ్లే కారులాంటి బోటన్నమాట. దాని ధర 5 లక్షల డాలర్లు (సుమారు 4.3 కోట్ల రూపాయలు). దానికి మరికొంత ఖర్చుపెట్టి ఫెరారీ రేస్ కారులా డిజైన్ చేశాడతను. అలా చేయించినవాడు ప్రయాణానికి వాడతాడు అనుకుంటే... ఇంట్లో షాండ్లియర్‌కి బదులు ఈ కారుని వేలాడదీశాడు. దాని హెడ్‌లైట్‌లూ, లోపలి లైట్‌లని రంగురంగుల దీపాలతో నింపాడు. మహ్మద్ బైరాగ్దారి అనే ఆ ఇంటి యజమాని ఓ వ్లాగర్ కూడానట. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వేలాడదీసిన కారు వీడియో పెడితే 2.3 కోట్ల వీక్షణలూ, ఎనిమిది లక్షల లైకులూ వచ్చాయట! అసలు అతను చేసిందంతా ఈ వీక్షణలూ లైకులకోసమేనని విమర్శిస్తున్నవాళ్లూ లేకపోలేదనుకోండి...!

నేరాల్లేని గ్రామం... ఇది!

నేర నిపుణులు తరచూ మాస్ హిస్టీరియా గురించి చెబుతూ ఉంటారు. మన పరిసరాల్లో ఎక్కువగా గొడవలూ హత్యలూ దొంగతనాలూ ఆత్మహత్యలూ చోటు చేసుకుంటూ ఉంటే అవి మనదగ్గరా జరిగే ప్రమాదం ఉందంటారు. దాన్ని అధిగమించాలంటే చదువు, మంచి అలవాట్లూ, మిత్రులూ ఉండాలని చెబుతుంటారు. అసోంలోని నాగావ్ జిల్లాలో సహారియా గ్రామంలో అవన్నీ నిండుగా ఉన్నాయి. ఆ పల్లె చుట్టుపక్కల ఉన్న ఇతర గ్రామాల్లో మాదకద్రవ్యాల కేసులు ఎక్కువ. కొట్లాటలు మొదలు హత్యలదాకా ప్రతి ఊరి నుంచీ ఏటా రెండు మూడైనా కేసులు నమోదవుతుంటాయి. వాటి మధ్య ఒక్క నేరం కూడా లేని గ్రామంగా నిలుస్తోంది సహారియా... అదీ గత మూడు దశాబ్దాలుగా! పూర్తిగా వ్యవసాయంపైన ఆధారపడ్డ ఈ గ్రామంలో 250 గడపలున్నాయి. ఏవైనా చిన్న గొడవలు వస్తే తీర్చడానికీ, గ్రామస్థుల మధ్య పరస్పర సహకారానికీ ఇక్కడ విలేజ్ డిఫెన్స్ పార్టీ అనే సంస్థా, పలు మహిళా సంఘాలూ పనిచేస్తాయి. అవే ఇక్కడి యువతని మాదక ద్రవ్యాలవైపు వెళ్లకుండా చూడడంతోపాటు వాళ్లు పూర్తిగా చదువుల్లోనూ క్రీడల్లోనూ సంగీత నృత్య కళల్లోనూ లీనమయ్యేలా జాగ్రత్తపడుతున్నాయట. ఆ ఊరి యువతలో చాలామంది పీహెచ్‌డీలూ చేస్తున్నారంటే... చూసుకోండి!



ప్రకటనలు నడుస్తున్నాయ్..!





ఉదయం పత్రిక తెరిచింది మొదలు- టీవీల్లో, ఫోనుల్లో ఎన్నో ప్రకటనలు కనిపిస్తాయి. కాలు బయటపెడితే చాలు, పెద్ద పెద్ద యాడ్ హోర్డింగులూ, డిస్‌ప్లే బోర్డులూ దర్శనమిస్తాయి. ఈమధ్య షాపింగ్ మాల్స్‌లో, రద్దీ ప్రాంతాల్లో అలా హ్యూమన్ ప్రకటనలు కూడా పలకరిస్తున్నాయి. పార్ట్‌టైం ఉద్యోగం చేసుకునేవాళ్లకూ మంచి అవకాశంగా మారిన ఈ మూవింగ్ యాడ్స్ సంగతులేమిటంటే...

డిగ్రీ చదువుతున్న కౌశిక్, ఖాళీ సమయాల్లో ఏదైనా పని చేయాలనుకున్నాడు. కానీ అలా తనకు నచ్చిన సమయాల్లో పని చేయాలంటే అందుకు కచ్చితంగా తన దగ్గర బైక్ ఉండాలి. దాంతో అవసరం లేకుండా రోజూ ఒక పూట పనిచేసేలా ఏదైనా ఉందేమో అని వెతుకుతుంటే- అప్పుడే ఫ్రెండ్స్ ద్వారా 'ఐవాకర్స్' గురించి తెలిసింది. ఇదో ప్రకటనలకు సంబంధించిన పని. ఇక ఆలస్యం చేయకుండా వీలు కుదిరినప్పుడల్లా ఆ పనికి వెళుతూ పాకెట్‌మనీని సంపాదించుకుంటున్నాడు. ఇలా ఇతను ఒక్కడే కాదు, అయిదారు గంటలు పనిచేయాలనుకునేవాళ్లెందరికో ఉపయోగపడే ఈ 'ఐవాకర్ యాడ్స్' ట్రెండ్ హైదరాబాద్‌తో సహా వివిధ నగరాల్లో నడుస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే...

అసలేంటీ నడిచే ప్రకటన...

మామూలుగా ఏదైనా సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే కరపత్రాలు ఇస్తుంటారు. పత్రికల్లో, టీవీల్లో యాడ్స్ వేస్తుంటారు. రోడ్డు మీద అందరికీ కనిపించేలా బ్యానర్లలాంటివీ ఏర్పాటు చేస్తుంటారు. ఇంకా ఆటోలూ, కార్లలాంటి వాహనాల మీద కూడా అడ్వర్టయిజ్‌మెంట్లు చూడొచ్చు. అంతేనా... ఫోన్లకీ రోజుకి వందలాది యాడ్స్ వస్తుంటాయి. వీటన్నింటి కన్నా వినూత్నంగా, ఇంకాస్త ఫోకస్ చేయాలనే ఆలోచనతోనే ఈమధ్య ఐవాకర్స్ యాడ్స్‌ని తీసుకొచ్చారు. జనాలతో కిటకిటలాడే ప్రాంతాల్లో బ్యాక్‌ప్యాక్‌లాంటి ఎల్ఈడీ బోర్డుల్ని వేసుకుని మనుషులు నిలబడటాన్నే హ్యూమన్ బిల్‌బోర్డ్స్, ఐవాకర్స్ అని పిలుస్తారు. వీళ్ళు యాడ్ స్క్రీన్స్‌ను చేతులతో పట్టుకునీ, వీపుకు కట్టుకునీ నలుగురి దృష్టి పడేటట్లు మాల్స్ దగ్గర కూర్చుంటారు, గుంపులో సరదాగా అటూ ఇటూ నడుస్తుంటారు. ఇంకా బ్యాగుల్లా తగిలించుకుని బైకు మీద కాస్త దూరం ప్రయాణిస్తూ కూడా ఈ ప్రకటనల్ని ప్రదర్శిస్తుంటారు. యాడ్ సమాచారాన్ని చుట్టూ ఉన్న వాళ్లకు తెలిసేలా చేయడమే వీటి ముఖ్య ఉద్దేశం. లైట్లతో మిరుమిట్లు గొలిపే ఆ తెరల మీద వీడియోల్నీ ప్లే చేస్తుంటారు. పెద్ద పెద్ద బట్టల దుకాణాలూ, ఫర్నిచర్, జ్యువెలరీ షాపులూ, విద్యా సంస్థలూ ఇంకా కుటుంబ- రాజకీయ వేడుకలూ కార్యక్రమాల్లోనూ ఈ 'ఐవాకర్స్' యాడ్స్‌ని వాడుతున్నారు.

ఏంటీ వీటి ప్రత్యేకత...

ఇతర ప్రకటనలతో పోల్చితే వీటికి తక్కువ ఖర్చు అవుతుందట. జనాల్లోకి సులువుగా విషయాన్ని తీసుకెళ్లడంలోనూ ఇది ముందే ఉంటుంది. దీని వల్లే ఈ హ్యూమన్ బిల్‌బోర్డ్స్‌ని బాగా ఉపయోగిస్తున్నారట. హైదరాబాద్‌లోని 'ఏడీ వాకర్' లాంటి యాడ్ కంపెనీలు తెలుగురాష్ట్రాల్లో ఈ సేవల్ని అందిస్తున్నాయి. ప్రకటనలు ఇచ్చే సంస్థ నుంచి ఒక ఐవాకర్‌కి నాలుగైదు గంటలకు దాదాపు రూ.1200 వరకూ వసూలు చేస్తున్నాయి. ప్రకటనను తయారు చేసి కోరిన సమయంలో, అడిగిన చోట ఐవాకర్స్‌ని ఏర్పాటు చేస్తుంటాయి. మరోవైపు పార్ట్‌టైం జాబ్ చేసుకోవాలనుకునేవాళ్లూ వీళ్లను సంప్రదించొచ్చు. ఒక పూటకు రూ.600 వరకూ ఇస్తారట.

ఇదివరకు విదేశాల్లో యాడ్స్‌కు సంబంధించిన డ్రెస్సులూ, టోపీలూ పెట్టుకుని ట్రాఫిక్ సిగ్నళ్ల దగ్గర నిలబడేవారట. హ్యూమన్ బిల్‌బోర్డ్స్‌గా పిలిచే ఈ ప్రకటనలే ఇప్పుడు ఐవాకర్స్‌గా మారాయనుకోవచ్చు. కొత్త సాంకేతికతను జోడించుకుని ఎల్ఈడీ తెరలతో ప్రజలు ఉన్నచోటుకే వెళ్లి యాడ్స్ వివరాల్ని అందిస్తున్నాయి. ఏది ఏమైనా, ఈ నడక ప్రకటనల ట్రెండ్ ఐడియా మాత్రం నిజంగా అదిరిపోయింది కదూ! ★





స్నేహమంటే ఇదేరా!




స్నేహబంధానికి అందరూ గులాములే! మైత్రిలోని మాధుర్యాన్ని ఆస్వాదించిన శ్రీకృష్ణుడూ, శ్రీరాముడూ సైతం స్నేహానికి ఎంత విలువ కట్టారో పురాణాల్లో చదివాం. తులతూగే సంపదలు ఎన్నున్నా స్నేహానికి సరిరావంటూ నిజజీవితంలో ఈ బంధం ఔన్నత్యాన్ని చూపిస్తున్నవారి గురించీ అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. కష్టాల్లో తోడుగా నిలిచిన గొప్ప మిత్రుల్నీ చూస్తుంటాం. ఆకాశమంత ఆత్మీయతను పంచే అలాంటి నేస్తాలు ఒకరిద్దరైనా కచ్చితంగా మన అందరి జీవితాల్లోనూ భాగమై ఉంటారు! ఆ చెలిమికి గుర్తుగా పుట్టిందే ఈ పండుగ, ఫ్రెండ్‌షిప్ డే!

తరాల అంతరంతో ఎంతో లాభం!



'మీ స్నేహితుల వయసు ఎంత ఉంటుంది?' అని ఎవరైనా అడిగితే 'నా తోటివాళ్లే కదా నాకు మిత్రులు, నా వయసే' అని చెబుతారు చాలావరకూ. కానీ మనకన్నా పెద్ద, చిన్న వయసువాళ్లతో స్నేహం చేస్తే బోలెడన్ని లాభాలు ఉన్నాయంటున్నాయి తాజా పరిశోధనలు. ఈ 'ఇంటర్‌జనరేషనల్ ఫ్రెండ్‌షిప్' వల్ల అటు పెద్దవాళ్లకీ, ఇటు చిన్నవాళ్లకీ ఉపయోగమేనట. ఈ ఏజ్ గ్యాప్ ఫ్రెండ్‌షిప్ మీద ఇజ్రాయెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ నెగెవ్, కెనడాలోని టొరంటో యూనివర్సిటీ కలిసి ఓ పరిశోధన చేశాయి. అందులో భాగంగా తమకన్నా దాదాపు పదేళ్ల చిన్నవయసున్నవారితో స్నేహం చేస్తున్న 60 ఏళ్లకు పైబడిన ఐదువేల మందిని పరిశీలించారు. వయసుతోపాటు వచ్చే శరీర మార్పులతో కలిగే బాధ, ఒత్తిడీ వీళ్లలో ఎక్కువగా కనిపించలేదట. ఆ తేడాల్నీ స్వీకరిస్తూ మానసికంగా చాలా దృఢంగా ఉన్నారట. అంతేకాదు... పెద్దవాళ్లు తమ కన్నా చిన్న వయసువారితో స్నేహం చేయడం ద్వారా ఒంటరితనం బాధించదు, ఒత్తిడి తగ్గుతుంది, కొత్తవిషయాల్ని నేర్చుకునే నేర్పు పెరుగుతుంది, మెదడు చురుగ్గా పనిచేస్తుంది, అనుభవాల్ని పంచుకోవడం వల్ల బంధం దృఢంగా మారుతుంది, యూత్‌ఫుల్ ఆలోచనలతో ఎప్పుడూ ఆనందంగా ఉంటారట. ఇంకా స్నేహబంధంతో జీవితకాలమూ పెరుగుతుందట. అదే చిన్న వయసు వాళ్లేమో... పెద్ద వాళ్ల సలహాలతో సమస్యల్ని అధిగమించొచ్చు, తోటి వయసు స్నేహితులతో చెప్పుకోలేని విషయాలన్నీ పంచుకోవచ్చు, కొత్త కొత్త నైపుణ్యాలూ నేర్చుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ ఏజ్‌గ్యాప్ ఫ్రెండ్‌షిప్ అన్నివిధాలుగా గొప్ప బంధమే అవుతుందట!

ఏఐ ఫ్రెండ్!



'ఈరోజు ఆఫీసులో ఏం జరిగిందో తెలుసా' అంటూ మనం చెప్పే ప్రతి విషయాన్నీ వింటుంది, 'ఆ సంఘటన నన్ను చాలా బాధించింది' అంటూ మన ఫీలింగ్స్‌ని పంచుకుంటే ఓదార్చుతుంది, 'అసలు ఇప్పుడు ఏం చేయాలో నాకు తోచట్లేదు' అని అడిగితే సలహా ఇస్తుంది... మామూలుగా ఫ్రెండ్స్ ఎవరైనా ఇలాగే చేస్తారు. కానీ అలాంటి గొప్ప స్నేహితుడిగా మారింది ఏఐ ఫ్రెండ్. ఓ మంచి మిత్రుడి స్థానంలో రెప్లికా, క్యారెక్టర్, డైలీఫ్రెండ్, టాకీ, అనిమా... లాంటి ఏఐ యాప్స్ ఎన్నో వచ్చాయి. ఆండ్రాయిడ్, ఐఫోన్‌లలో అందుబాటులో ఉన్న 'క్యారెక్టర్' ఏఐ ఫ్రెండ్ యాప్‌లో రకరకాల పాత్రలు ఉంటాయి. మన ఇష్టాలకు తగ్గట్టు వాటిల్లో ఒక ఫ్రెండ్‌ని ఎంచుకుని స్నేహం చేయొచ్చు. చాట్ చేస్తూ మాట్లాడొచ్చు, ఇంకా లైబ్రరీలో ఉన్న గొంతును సెట్ చేసుకుంటే ఫోన్‌కాల్స్ కూడా మాట్లాడొచ్చు. 'డైలీఫ్రెండ్' ఏఐతో రోజూ మన అనుభవాల్ని పంచుకుంటే భావోద్వేగాలకు తగ్గట్టు సూచనలూ ఇస్తుంది. ఇలా ఒక్కో ఏఐ ఫ్రెండ్ యాప్ ఒక్కోరకమైన ప్రత్యేకతలతో ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆటలాడుతూ, ఒంటరితనాన్ని పోగొడుతూ, అవసరమైంది నేర్పిస్తూ చక్కటి నేస్తం అనిపించుకుంటోంది ఏఐ ఫ్రెండ్.

దోస్తుల వ్యాపారాలు!

కాలేజీలో చదువుకుంటున్నప్పుడూ, ఆఫీసులో కలిసి పనిచేస్తున్నప్పుడూ 'అరె ఏదైనా చేద్దాం, కొత్త వ్యాపారమేదైనా పెట్టి మంచి పేరు తెచ్చుకుందాం' అంటూ చాలా మంది ఫ్రెండ్స్ మాట్లాడుకుంటారు. అలాంటి మాటల్ని చేతల్లో చూపి గత కొన్నేళ్లల్లో సరికొత్త ఆలోచనల్ని స్టార్టప్స్‌గా మార్చి పెద్ద విజయాలు అందుకున్నారు కొంతమంది స్నేహితులు. ఫుడ్ డెలివరీల్లో పెద్ద వ్యాపార సంస్థగా ఎదిగిన 'జొమాటో'ని దీపిందర్ గోయల్, తన స్నేహితుడు పంకజ్ చద్దా కలిసి మొదలుపెట్టారు. ఉద్యోగం చేసే కంపెనీలో ఫుడ్ ఆర్డర్ ఇచ్చేందుకు ఉద్యోగులు పెద్ద ఎత్తున క్యూ కట్టాల్సి రావడం చూసి, ఆ సమస్యకు పరిష్కారం వెతికే పనిలోంచి ఏకంగా ఓ సంస్థనే పుట్టించారన్నమాట. ఇంకా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విదిత్ ఆత్రే, ఝార్ఖండ్‌కి చెందిన సంజీవ్ బర్న్‌వాల్ ఐఐటీ-దిల్లీలో కలిసి చదువుకున్నారు. రకరకాల ప్రయోగాలు చేస్తూ 'మీషో' స్టార్టప్‌తో హిట్ కొట్టారు. 'ఓలా', 'అర్బన్ కంపెనీ' 'ఏథర్ ఎనర్జీ', 'ఫ్లిప్‌కార్ట్', 'ఎయిర్‌బీఎన్‌బీ'... ఇలా ఎన్నో స్టార్టప్ కంపెనీలు స్నేహితులు కలిసి మొదలుపెట్టినవే!

ముగ్గురు మిత్రులు



కలిసి చదువుకోవడం వల్లనో, ఒకే దగ్గర పెరగడంతోనో ఒకరికొకరు ఫ్రెండ్స్ అవుతుంటారు. కానీ అనుకోకుండా ప్రయాణంలో కలిసిన ఆ ముగ్గురు వ్యక్తులు- జీవితకాలపు ప్రాణస్నేహితులు అయ్యారు. వీళ్ల అనుబంధం వెనక... దోస్తుల కబుర్లని దాటిన కథ ఉంది. కరీంనగర్‌కు చెందిన ఈ ముగ్గురు మిత్రుల పేర్లు రవి, సురేశ్, పరమేశ్వర్‌రెడ్డి. పేదరికంతో చదువు మానేసిన రవి పొట్టకూటి కోసం ఆటో కొన్నాడు. పుట్టుకతోనే అంధులైన సురేశ్, పరమేశ్వర్- అప్పుడప్పుడూ రవి ఆటో ఎక్కేవాళ్లు. అలా అనాథాశ్రమంలో ఉండే వీళ్లకు రవితో మంచి దోస్తీ కుదిరింది. చూపులేకపోయినా బాగా చదువుకోవాలన్న పట్టుదలతో ఉండే తన మిత్రుల్ని చూసి గర్వపడే రవి- వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకోకుండానే ఎక్కడికైనా తీసుకెళ్లేవాడు. ఎక్కడ, ఏ పని ఉన్నా... ఆటోలో తీసుకెళ్తూ, అవసరమైతే రోజంతా వెంటే ఉండేవాడు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరిస్తూ అన్ని విధాలుగా స్నేహితులకు తోడుండేవాడు. ఉద్యోగం సాధించి గొప్ప స్థాయిలో నిలబడాలంటూ పదేపదే ప్రోత్సహించేవాడు. స్నేహితుడి తోడ్పాటుతో సురేశ్, పరమేశ్వర్ చదువు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల్ని సాధించారు. ప్రస్తుతం సురేశ్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా, పరమేశ్వర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ సహాయకుడిగా చేస్తున్నారు. '25 ఏళ్లుగా మాకు తోడూనీడైన రవి రూపం ఎలా ఉంటుందో తెలియదు కానీ నిస్వార్థమైన అతని మంచి మనస్సు మాత్రం మాకు తెలుసు' అంటూ సంతోషంగా చెబుతుంటారు సురేశ్, పరమేశ్వర్. అంతేనా... 'మా ఎదుగుదలలో భాగమైన రవిని మేం ఎప్పటికీ మరిచిపోలేం' అంటూ ఆర్థికంగా ఆదుకుంటున్నారు ఈ ఇద్దరు స్నేహితులు.

– తుమ్మల శ్రీనివాస్,
ఈనాడు, కరీంనగర్


80 ఏళ్ల వయసులో స్నేహితుల యాత్ర!

'కోలాంబస్ కోలాంబస్ ఇచ్చారు సెలవు, ఆనందంగా గడపడానికి కావాలొక దీవి' అంటూ కాలేజీ రోజుల్లో సరదాగా ఫ్రెండ్స్‌తో టూర్లకు ప్లాన్ చేసుకుంటారు స్నేహితులందరూ. కానీ ఎనభైల్లో అదే ఉత్సాహంతో విహార యాత్రల్ని పూర్తి చేశారు ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్. సాహసోపేతమైన ప్రపంచ పర్యటన చేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. అమెరికాలోని టెక్సాస్‌లో ఉండే ఫొటోగ్రాఫర్ ఎల్లీ హంబీ, డాక్టర్ శాండీ హేజ్‌లిప్ ప్రాణస్నేహితులు. వీళ్లిద్దరూ కలిసి ప్రపంచంలోని ప్రముఖ సందర్శక ప్రాంతాల్ని చుట్టిరావాలనుకున్నారు. కానీ అది వాయిదా పడుతూ వచ్చిందట. ఇద్దరికీ 80 ఏళ్లు వచ్చాక ఎలాగైనా తమ కలని నెరవేర్చుకోవాలనుకున్నారు. కొవిడ్ వల్ల అదీ కుదరలేదట. దీంతో 2023లో 81 ఏళ్ల వయసులో తమ టూర్‌ని మొదలుపెట్టి ఏడు ఖండాల్లోని దేశదేశాలు తిరిగారు, ప్రపంచ వింతలన్నీ చూసొచ్చారు. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, జపాన్, ఫిన్లాండ్, నేపాల్... తదితర దేశాలతోపాటు మనదేశానికీ వచ్చారు. దిల్లీ, ఆగ్రా, రాజస్థాన్‌లోని పర్యటక ప్రాంతాల్లో గడిపారు. టూర్ ప్యాకేజీలు కాకుండా, లగ్జరీ హోటళ్లలో ఉండకుండా... సింపుల్‌గా తక్కువ బడ్జెట్లోనే యాత్ర మొత్తం చేయాలనుకునే నియమం పెట్టుకుని, ఏ ఇబ్బందీ లేకుండా యాత్రను పూర్తిచేశారు. ఆ ట్రావెల్‌కి సంబంధించిన అనుభవాలన్నింటినీ సోషల్‌మీడియాలో పంచుకోవడంతో ఈ బెస్ట్ ఫ్రెండ్స్ టూర్ మరింత హిట్ అయింది!



ఆ ఊరి పేరు 'ఫ్రెండ్‌షిప్'!

న్యూయార్క్‌లో 'ఫ్రెండ్‌షిప్' పేరుతో పెద్ద పట్టణమే ఉంది. కొన్ని వందల ఏళ్ల క్రితం అక్కడ రెండు తెగల మధ్య తరచూ గొడవలు జరిగేవట. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఫైటింగ్ కార్నర్స్'గా పిలిచేవారట. ఆ తర్వాత అక్కడుండే జనాలు కలిసిమెలిసి ఉండాలంటూ వాళ్లలో సయోధ్యను పెంచడానికి రకరకాల కార్యక్రమాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే 1815లో అధికారికంగా ఆ ఊరికి ఫ్రెండ్‌షిప్ అనే పేరు పెట్టారు. అమెరికాలోని ఆడమ్స్ కౌంటీలో కూడా 'ఫ్రెండ్‌షిప్' పేరుతో మరో ఊరు ఉంది. 1857లో న్యూయార్క్‌లోని 'ఫ్రెండ్‌షిప్' పట్టణం నుంచి వలస వెళ్లినవాళ్లందరూ కలిసి ఓ దగ్గరకు చేరి గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారట. కలిసికట్టుగా ఉండాలన్న ఆలోచనతో తమ సొంత ఊరి పేరునే కొత్త గ్రామానికీ పెట్టుకున్నారు.




నేస్తం కోసం!

స్నేహం అంటేనే తెలియని వయసు వీళ్లది. కానీ వీళ్లు చేసిన పని గురించి తెలిసినవాళ్లెవరైనా 'స్నేహం అంటే వీళ్లదే' అంటారు. ఒకే రకమైన డ్రెస్సులతో బోడి తలలతో ఒకేలా కనిపిస్తున్న ఈ పిల్లలది యూకేలోని బెర్క్‌షైర్. ఫుట్‌బాల్ ఆడటం అంటే వీళ్లకెంతో ఇష్టం. ఒకరోజు ఆట మధ్యలో వీళ్లలో ఒకరైన హ్యారీ మిల్స్ కిందపడి పోయాడు. ఆ చిన్న ప్రమాదంతో ఆసుపత్రికి వెళ్లిన హ్యారీ... పెద్ద ప్రమాదంలో ఉన్నాడని తెలిసింది. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్ బారిన పడ్డాడని తేలింది. వెంటనే కీమోథెరపీలు మొదలుపెట్టగా జుట్టు అంతా ఊడిపోయిందట. ఫ్రెండ్స్‌తో ఆడుకోవడానికి ఎందుకు పంపడం లేదో, తన జుట్టు పూర్తిగా ఎందుకు ఊడిపోయిందో తెలియక పదేళ్ల హ్యారీ కుంగిపోయాడు. అది తెలుసుకున్న అతని స్నేహితులు అందరూ తమ ఫ్రెండ్ కోసం గుండు చేయించుకున్నారు. అంతేనా... స్నేహితుడిని ఎలాగైనా కాపాడుకోవాలంటూ దాదాపు 35 లక్షల రూపాయల విరాళాల్నీ సేకరించారు.





శ్రావణమాసం అంటే చటుక్కున గుర్తుకొచ్చేవి... వరలక్ష్మీవ్రతం, పేరంటాలు, అక్కడ ఇచ్చే సెనగలు. తాలింపుగానో, మరీ ఎక్కువ ఉంటే కూరలుగానో మారి ఈ నెలంతా సందడి చేసే సెనగల్లోని పోషకాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అందుకే సెనగలతో చేసిన పాల నుంచి బటర్ వరకూ ఎన్నో ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి ఇప్పుడు...



ఇస్తినమ్మ సెనగలు... పుచ్చుకుంటినమ్మ పోషకాలు!

సూపర్ ఫుడ్ అనగానే సూపర్‌మార్కెట్లోకి కొత్తగా వచ్చిన ఖరీదైన వెరైటీల కోసమే వెతుకుతాం. ఫిట్‌నెస్ కాపాడుకోవడానికి వేలకువేలు పోసి ప్రొటీన్ పౌడర్లు కొంటాం... కానీ తక్కువ ధరలో దొరికే అసలైన 'సూపర్‌ఫుడ్' సెనగలే. అందుకే 'పోషకాల పవర్‌హౌస్' అని చెప్పుకునే సెనగలని 'పూర్‌మ్యాన్స్ ఆల్మండ్' అని కూడా అంటారు. ఇవి మన శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు అందిస్తాయో చూద్దాం.

శరీర పనితీరుకి మెదడు ఎంత కీలకమో, జీర్ణవ్యవస్థ కూడా అంతే కీలకం. అందుకే దీన్ని 'సెకండ్ బ్రెయిన్' అంటారు. ఇక్కడ ఉండే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాని చురుగ్గా ఉంచి, మన గట్‌హెల్త్‌ని కాపాడేశక్తి సెనగలకి ఉందట. అందుకే వీటిని 'ప్రీ-బయోటిక్ ఫుడ్' అంటారు వైద్యులు. ఇక గట్‌హెల్త్ బాగుంటే నిండునూరేళ్లూ హాయిగా జీవించవచ్చని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. గతంతో పోలిస్తే వయసుతో సంబంధం లేకుండా ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యం ఇచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. వీళ్ల అజెండాలో ముందుండే అంశం... బరువు తగ్గడం! అలా బరువు తగ్గాలనుకున్న చాలామంది అన్నం, రొట్టెల్లాంటి కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారాన్ని పక్కనపెట్టి ప్రొటీన్ ఉన్న ఆహార పదార్థాలపైన దృష్టి పెడుతున్నారు. ఇందుకోసం కొంతమంది మార్కెట్లో దొరికే ప్రొటీన్ పౌడర్లని ఎంచుకుంటే, మరికొంతమంది మాంసం, గుడ్లు మాత్రమే ప్రొటీన్‌ని ఇస్తాయనుకుంటూ వాటినే తీసుకుంటున్నారు. కానీ ఆ అభిప్రాయం తప్పు... సెనగలు కూడా ప్రొటీన్‌ని పుష్కలంగా అందిస్తాయి. వంద గ్రాముల సెనగల నుంచి 11 గ్రాముల ప్రొటీన్ అందుకోవచ్చు. ఒక గుడ్డు నుంచి అందే ప్రొటీన్ కంటే ఇది ఎక్కువే! ఒక కప్పు ఉడికించిన సెనగలు తింటే... కడుపు నిండిన భావన కలిగి, ఆకలి అదుపులో ఉంటుంది. అలా కొన్నిరోజులకి ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గొచ్చుట. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే చెడుకొవ్వుని దూరం పెట్టాలన్నది తెలిసిన విషయమే! ఉడికించిన లేదా మొలకెత్తిన సెనగల్లోని ఫైటోకెమికల్స్ ఈ పనిని సమర్థంగా చేస్తాయట. గుండెకండరాల్లో ప్లేక్ లాంటి పదార్థాన్ని పేరుకుపోకుండా చేసి, చెడుకొలెస్ట్రాల్‌ని దూరం పెడతాయట. ఇక వీటిని- ప్రధానంగా వ్రతాల వంటి సందర్భాలలో ఆడవాళ్లకి ప్రసాదంగా ఇవ్వడంలో.. పరమార్థం లేకపోలేదు. మహిళల్ని ఎక్కువగా ఇబ్బంది పెట్టే అంశాలు రక్తహీనత, చిన్నవయసులోనే ఎముకలు గుల్లబారిపోవడం, మెనోపాజ్ సమయంలో తలెత్తే సమస్యలు. రోజూ కప్పు సెనగలని ఆహారంలో చేర్చుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుంది. ఇక వీటిల్లోని కాల్షియం, మెగ్నీషియం, కాపర్ వంటి ఖనిజాలు ఎముకల్ని గుల్లబారకుండా కాపాడతాయి. ఒక కప్పు సెనగల్లో... 79 మిల్లీగ్రాముల మెగ్నీషియం ఉంటే, 5 మిల్లీ గ్రాముల వరకూ ఐరన్ ఉంటుంది. అలాగే సెనగల్లోని ఫైటోఈస్ట్రోజెన్స్ మెనోపాజ్ సమయంలో ఎదురయ్యే వేడి ఆవిర్లనుంచి ఉపశమనం కలిగిస్తాయట. వయసుతోపాటు వచ్చే మతిమరుపు సంబంధిత జబ్బుల నుంచి బయటపడటానికీ ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఎన్నెన్నో రూపాల్లో...

తాలింపు వేస్తే కాసిని తింటాం, కూరగా చేస్తే ఒక రోజు తింటాం... కానీ రోజూ వీటిని ఎలా తింటాం అని సంశయించేవారికి ఇప్పుడు సెనగలు అనేక రూపాల్లో దొరుకుతున్నాయి. బరువు తగ్గాలనుకునే వారికి... ప్రొటీన్ ఉన్న సెనగల పాలు దొరుకుతున్నాయి. సాయంత్రం చిరుతిండిగా చేర్చుకోవాలనుకుంటే... పాప్‌కార్న్, అటుకులు, పఫ్స్, చిప్స్ రూపంలోనూ వస్తున్నాయి.

చిన్నారులు ఇష్టంగా తినేందుకు వీలుగా... షుగర్‌కోటెడ్ సెనగలు, ఐస్‌క్రీం, చాక్లెట్లూ లభ్యమవుతున్నాయి. సెనగలతో చేసిన బటర్ కూడా ఇప్పుడు మార్కెట్లో దొరుకుతోంది. బ్రెడ్, రోటీలాంటివాటికి ఇది మంచి కాంబినేషన్. సెనగలతో చేసిన చిక్‌పీ అయిల్‌ని సలాడ్లలోకానీ, తాలింపుల్లో కానీ వేసుకుంటే జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉండటంతోపాటు కీళ్లనొప్పులు అదుపులో ఉంటాయట. మనం ఇడ్లీ, దోసెల్లోకి పచ్చడి చేసుకున్నట్టుగానే బయటదేశాల్లో చాలాచోట్ల తెల్లసెనగలని రుబ్బి హమస్ డిప్ అని తయారు చేస్తారు. ఈ హమస్ డిప్స్ అనేక ఫ్లేవర్లూ, రుచుల్లో మనకీ అందుబాటులో ఉన్నాయి. ఇన్ని రుచుల్లో దొరుకుతూ, ఇన్ని పోషకాలని అందిస్తుంటే చూస్తూ ఊరుకుంటామా... నచ్చినవి తెచ్చుకుని లాగించేయడమే! ★



ప్రేమతో ఓ రాఖీ!

ఇంట్లోని చిట్టి తమ్ముడి మీదున్న ప్రేమనీ, ఉద్యోగం కోసం ఇంటికి దూరంగా ఉన్న అన్నయ్యపైన అనురాగాన్నీ తెలియజేసే పండుగ రాఖీపౌర్ణమి. కలకాలం తోబుట్టువులు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ అక్కాచెల్లెళ్లు రాఖీకడతారు. ఆ రక్షాబంధనంలోనే మమకారాన్నంతటినీ రంగరించేందుకు మార్కెట్ అంతా జల్లెడ పట్టేసి, ఏటికేడూ సరికొత్త రాఖీల్ని ఎంచుకుంటారు. అలా ఈసారి అలరిస్తున్న నయా రాఖీల సంగతులేంటో చూద్దామా...



తోబుట్టువుల అనుబంధానికి గుర్తుగా జరుపుకునే రక్షాబంధన్ అంటే అందరికీ ఇష్టమే. ఈ పండుగ దగ్గరపడితే కొత్త బట్టలూ, పిండివంటల మీద కన్నా... 'ఈసారి ఏ రాఖీ కొనాలి?' అంటూ అక్కాచెల్లెళ్లూ, 'ఏ బహుమతి ఇస్తే బాగుంటుంది?' అని అన్నదమ్ములూ ఆలోచిస్తుంటారు. అందుకు తగ్గట్టే మార్కెట్లోకి ఎప్పటికప్పుడు ఎన్నో వెరైటీల రాఖీలూ, కానుకలూ వచ్చేస్తుంటాయి. వాటిల్లో సోదరుల్ని సర్‌ప్రైజ్ చేసేవీ ఉన్నాయీ, పదికాలాలపాటు భద్రంగా దాచుకునేవీ వచ్చాయీ, మన ప్రేమలాగే విలువైనవీ దొరుకుతున్నాయి!

లాకెట్ బంధనం!



ఎంత విలువైన రాఖీని కొన్నా పండుగ తర్వాత పక్కనపెట్టాల్సిందే. అలా కాకుండా చేతికి కట్టిన రక్షాబంధనమే మెడలో వేసుకునేలానూ ఉంటే బాగుంటుంది కదా! ఆ ఆలోచనతోనే జ్యువెలరీ దుకాణాల్లో టూ ఇన్ వన్ రాఖీ లాకెట్లని అమ్ముతున్నారు. గొలుసులకు వేసుకునే బంగారూ, వెండీ లాకెట్లనే రాఖీల్లా మారుస్తున్నారు. తోబుట్టువుల అభిరుచికి తగ్గట్టు దేవుళ్ల రూపాల్నీ, పేర్లనీ, ప్రేమను తెలిపే అక్షరాల్నీ రక్షాబంధనాలుగా మార్చి ఇవ్వొచ్చు. రెడీమేడ్‌గా ఉన్నవే కాకుండా మనకు నచ్చినట్టు సొంతంగానూ వీటిని చేయించుకోవచ్చు. రాఖీలా చేతికి కట్టుకుని ఆ తర్వాత తీసి ఎంచక్కా చెయిన్‌కి వేసుకోవచ్చు. అంతేకాదు, దారాలతోనే కాకుండా బ్రేస్‌లెట్ బ్యాండ్లూ ఎన్నో ఉన్నాయి. సులువుగా ధరించేలా ఉండే ఈ బ్యాండ్ రాఖీ- అన్నయ్య చేతికి ఎంత స్టైలిష్‌గా ఉంటుందో మరి!



ఫొటో దాగుంది!





తమ అనుబంధాన్ని తెలుపుతూనే తమ్ముడిని ఆశ్చర్యపరచాలనుకునే అక్కయ్యలు కొత్తగా వచ్చిన ఈ ఫొటో ప్రొజెక్షన్ రాఖీల్ని ప్రయత్నించొచ్చు. ఫొటోలతో ఉన్న రకరకాల కస్టమైజ్డ్ రాఖీలు ఎప్పటినుంచో అలరిస్తున్నాయి కానీ వాటన్నింటికీ భిన్నంగా ఉంటుందీ సరికొత్త రక్షాబంధనం. చూడ్డానికి పెండెంట్లూ, రుద్రాక్షలూ, బొమ్మల ఆకారాలతోనే ఉన్నా- వాటి మధ్యలో మాత్రం గుండ్రటి చిన్న గ్లాస్ బీడ్ ఉంటుంది. దీన్ని కంటికి దగ్గరగా పెట్టుకుని చూసినా, లైట్ వేసినా అందులో ఫొటో కనిపిస్తుంది. ఈ గ్లాస్‌బీడ్‌ని ప్రత్యేకమైన ప్రొజెక్షన్ మినియేచర్ లెన్స్‌తో తయారుచేయడం వల్లే అలా ఫొటో కనిపిస్తుందన్నమాట. ఈ రాఖీల్లో మనకు నచ్చిన ఫొటోలేవైనా పెట్టుకోవచ్చు. మనం చేయాల్సిందల్లా... 'ఫొటో జ్యువెల్స్, చోకర్ టేల్స్' లాంటి వెబ్‌సైట్లలోకి వెళ్లి నచ్చిన రాఖీని ఎంచుకుని, ఫొటోని అందించడమే!

రత్నాల రాఖీలు!



మెరుపుల కాగితాలతో వచ్చే రాఖీలెన్నో కనిపిస్తుంటాయి. కానీ తాము కట్టే రక్షాబంధనం చూడ్డానికి కాస్త అందంగానూ, హుందాగానూ ఉండాలనుకుంటారు అక్కాచెల్లెళ్లు. బడ్జెట్లోనే ఆ ముచ్చట తీరాలంటే ఈ రత్నాల రాఖీల్ని ఎంచుకోవచ్చు. పచ్చలూ, కెంపులూ, కుందన్లూ, ముత్యాలతో ముచ్చటైన డిజైన్లలో లభిస్తున్నాయి ఇవి. మధ్యలో రాళ్ల పెండెంట్లతో పాటు రెండువైపులా ఆకట్టుకునే బీడ్స్‌తోనూ వీటిని తయారుచేస్తున్నారు. దీంతో పండుగ తర్వాత కూడా సరికొత్త బ్రేస్‌లెట్‌లా చేతికి ఉంచేసుకోవచ్చు. మరెందుకాలస్యం... ప్రేమతోపాటు దాన్ని వ్యక్తపరిచేలా ఓ చక్కటి రాఖీ కట్టి, మీ అన్నదమ్ముల మనసు గెలుచుకునే ప్రయత్నం చేసేయండి!

వదినమ్మకూ కట్టేద్దాం!



నాన్నలా కంటికి రెప్పలా జీవితాంతం రక్షణగా ఉండాలంటూ అన్నదమ్ములకు రాఖీ కట్టినట్టే అమ్మలా అమితమైన ప్రేమను చూపే వదినామరదళ్లకూ రాఖీ కడుతుంటారు. అందుకోసమే, విడివిడిగా కాకుండా ఇద్దరికీ సెట్‌లా 'భయ్యా భాభీ రాఖీ'లు దొరుకుతున్నాయి. జతగా వచ్చే ఈ రక్షాబంధనాల్లోనూ ఇప్పుడు చాలా వెరైటీలు ఉన్నాయి. ఏదో ఒక రంగు దారం అన్నట్టుగా కాకుండా మువ్వలూ, రంగురాళ్లతో ఎంతో అందంగా ముస్తాబవుతున్నాయి. ప్రత్యేకంగా వదినమ్మ కోసం ముత్యాలూ, నల్లపూసల రాఖీలు హల్‌చల్ చేస్తున్నాయి. చేతికి ఆభరణంలా మారిపోతూ సోదరి ప్రేమను చెప్పకనే చెబుతున్నాయన్నమాట!

కథ

అంజలిదే గొనుమా...

– సి.ఎన్.చంద్రశేఖర్

“కృష్ణా... లోన్ కోసం ఓ అమ్మాయి వచ్చింది. ఆమెని మీ దగ్గరకు పంపాను. మనమేమైనా సహాయం చేయగలమేమో చూడండి” బ్రాంచి మేనేజర్ సతీష్ ఫోనులో నాతో చెప్పారు.

“అలాగే సార్, చూస్తాను” అన్నాను.

అయిదు నిమిషాల తర్వాత ఓ అమ్మాయి నా ఎదురుగా వచ్చి నమస్కారం పెట్టి నిలబడింది. ఇరవయ్యేళ్ళు ఉంటాయి ఆమెకి. చామనఛాయతో, పెద్దపెద్ద కళ్ళతో, సన్నగా, పొడుగ్గా, అందంగా ఉంది. ఆమె ముఖంలో అమాయకత్వంతో పాటు ఉత్సాహం కూడా కనిపించింది నాకు.

ప్రతి నమస్కారం చేసి “మేనేజరుతో లోన్ గురించి మాట్లాడింది మీరేనా?” అని అడిగాను.

“అవునండీ. నా పేరు జయశ్రీ. ఇంటర్ వరకూ చదివాను. నాన్న లేరు. అమ్మ చదువుకోలేదు. వంటలు చేస్తుంది. నాకు లోన్ ఇచ్చారంటే ఏదైనా వ్యాపారం చేసుకుని బతుకుతాం.”

నేను ఆమెని ఏ ప్రశ్నలు అడగాలనుకున్నానో వాటికి జవాబులు నేను అడగకుండానే ఆమె చెప్పడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ‘ఎదుటి మనిషి పరిస్థితిని అర్థం చేసుకుని వారి సమయాన్ని వృథా చేయకుండా ఎలా ప్రవర్తించాలో ఈమెకి తెలుసు’ అనుకున్నాను.

“ఏం వ్యాపారం చేస్తారు, ఎంత లోన్ కావాలి?” అని అడిగాను.

“పాతికవేలిస్తే మురుకులూ పప్పుబిళ్ళలూ స్వీట్లూ తయారుచేసి ఇంటింటికీ అమ్ముతాం సార్. మా అమ్మ వంటలు బాగా చేస్తుంది. వీలైతే క్యాటరింగ్ కూడా చేద్దామని ఉంది” అంది.

“మీ అమ్మగారికి ఎంత వయసు ఉంటుంది?”

“యాభై పైనే.”

“మరి ఇన్ని చేయాలంటే ఆవిడకి శ్రమ అవుతుంది కదా?”

“నేను ఉంటానుగా సార్. అమ్మ చెబుతూ ఉంటే నేను చేస్తాను. మీరు మా అమ్మ గురించి ఆలోచించడం నాకు సంతోషంగా ఉంది సార్” అంది ఆనందంతో.

‘ఈమె మనసులో ఏదీ దాచుకోదు’ అనుకున్నాను మనసులో.

“మీకు యాభైవేలు ఇస్తాను. అయితే అది లోను రూపంలో కాకుండా ఓవర్‌డ్రాఫ్ట్ రూపంలో ఇస్తాను. మీరు అందులోంచి మీకు ఎంత అవసరమో అంత మొత్తాన్నే తీసుకుంటూ ఉండొచ్చు. ఆ మొత్తానికే వడ్డీ పడుతూ ఉంటుంది. మీకు వచ్చే రాబడి నుండి మీ ఖర్చులకు పోనూ మిగతాది అందులో జమచేస్తూ ఉంటే వడ్డీ భారం తక్కువవుతుంది. మీ అకౌంట్ సంతృప్తికరంగా నడిస్తే భవిష్యత్తులో వ్యాపార అవసరాలకు బ్యాంకు నుంచి మరింత పెద్ద మొత్తంలో లోను పొందవచ్చు” అన్నాను.

“అలాగే సార్!” అంది కృతజ్ఞతాభావంతో నన్ను చూసి.

“మీ ఇల్లు ఇక్కడికి దగ్గరేనా?”

“చాలా దగ్గర సార్. నడచి వెళ్తే అయిదు నిమిషాలు.”

“అయితే వెళ్ళి మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ బుక్ తీసుకురండి. వాటి జిరాక్స్ కాపీలు కూడా తీసుకుని రండి. మీకు ఓడీ శాంక్షన్ చేస్తాను. తర్వాత మీరు కొన్న సరకుల బిల్లు నాకు తెచ్చివ్వాలి” అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా నా వైపు చూసి “ఇప్పుడే ఇచ్చేస్తారా?” అని అడిగింది.

“ఏం... వద్దా?”

“అయ్యో, కావాలి సార్. ఇప్పుడే వెళ్ళి తీసుకొస్తాను” అంటూ పరుగులాంటి నడకతో బ్యాంకు బయటికి వెళ్ళింది. నేను నవ్వుకుంటూ నా పనిలో నిమగ్నమయ్యాను.

పదిహేను నిమిషాల తర్వాత జయశ్రీ ఓ యాభైఏళ్ళావిడతోపాటు వచ్చి నా ముందు నిలబడింది.

“సార్, మా అమ్మ... మిమ్మల్ని చూడాలని ఉందని చెబితే తీసుకొచ్చాను” అంది.

ఆవిడ నాకు నమస్కారం చేసింది. ఆవిడను చూడగానే గౌరవభావం కలిగింది నాకు. ఆవిడ పోలికలు జయశ్రీకి ఉన్నాయనిపించింది.

“నమస్తే అమ్మా. మీరు నాకు నమస్కారం చేయడమేమిటి? పెద్దవాళ్ళు మీరు. ఆ పేపర్లు ఇచ్చి కాసేపు కూర్చోండి. పనయ్యాక చెబుతాను” అన్నాను.

ఇద్దరూ సంతోషంగా వెళ్ళి నా ఎదురుగా ఉన్న బెంచీపైన కూర్చున్నారు. సిస్టంలో లోన్ ప్రాసెస్ చేస్తూ మధ్యమధ్యలో జయశ్రీ వైపు చూడసాగాను. జయశ్రీ ఏదో చెబుతూంటే ఆమె తల్లి ఆసక్తిగా వింటోంది.

జయశ్రీని అలా చూస్తూంటే మనసులో ఎంతో బాధ కలిగింది నాకు. ‘తండ్రి పోషణలో ఉంటూ, హాయిగా ఆడుతు పాడుతూ చదువుకోవలసిన వయసులో ఆ అమ్మాయి చదువు ఆపేసి తల్లితో బాధ్యతలు పంచుకోవలసిరావడం విచారకరం’ అనుకున్నాను. వారి పని పూర్తిచేశాక డబ్బులు ఎలా తీసుకోవాలో చెప్పి పంపాను.

నాలుగురోజుల తర్వాత ఓ ప్యాకెట్ తెచ్చి నాకివ్వబోయింది జయశ్రీ.

“ఏమిటది” ఆసక్తిగా చూస్తూ అడిగాను.


“స్వీట్లు... మా వ్యాపారం మొదలుపెట్టగానే ముందు మీకివ్వాలని అనుకున్నాం” అంది చిరునవ్వుతో.

‘ఈ అమ్మాయి నవ్వు ఎదుటి మనిషికి ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది’ అనుకున్నాను.

“థాంక్యూ! వీటి ధర ఎంత?” అని అడిగాను ఆమెని.

“సార్... అది మేము సంతోషంతో ఇస్తున్నది- డబ్బుకు కాదు. ప్లీజ్ తీసుకోండి” అంది అభ్యర్థనగా.

“చాలా సంతోషం. మీకో విషయం చెప్పనా? మా వీధిలో పూలమ్మీ, కూరగాయలమ్మీ ముందు మా ఇంటికే వస్తారు. నేను బోణీ చేస్తే వారి సరుకంతా తొందరగా అమ్ముడయిపోతుందట. మీకు కూడా మంచి వ్యాపారం జరగాలని నేను బోణీ చేస్తాను. వద్దనకండి” అంటూ పర్సు తీసి వాటి ధర ఎంతో కనుక్కుని డబ్బులు ఇచ్చాను.



జయశ్రీ మొహమాటపడుతూనే తీసుకుంది.

సంవత్సరం తర్వాత 'తాము బట్టల వ్యాపారం చేస్తామనీ, తమ దగ్గరున్నది కాక మరికొంత మొత్తం అవసరమవుతుందనీ' చెప్పింది జయశ్రీ.

"ఇప్పుడు చేస్తున్న వ్యాపారం మానేస్తున్నారా?" అని అడిగాను.

"లేదు సార్. ఆర్డర్లు బాగానే వస్తున్నా ఇంకా సమయం మిగులుతూ ఉంది. ఆ టైమ్‌లో 'ఇంకేదైనా చేయొచ్చు కదా' అనిపించింది. బట్టల బిజినెస్‌లో మార్జిన్ కూడా ఎక్కువగా ఉంటుంది."

"ఎక్కడ కొంటారు బట్టలు?"

"బెంగళూరు వెళ్ళి కొంటాం సార్. ఇక్కడున్నవాళ్ళకి వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లించే విధంగా ఇస్తాం."

"ఎంత కావాలి?"

"లక్ష కావాలి సార్" మొహమాటంగా చూస్తూ అంది జయశ్రీ.

"రెండు లక్షలు ఇస్తాను. మీకు ఇదివరకున్న అక్కౌంటుకే లిమిట్ పెంచుతాను. మీరు అందులోంచే తీసుకోవచ్చు. ఇదివరకులా అందులోనే కడుతూ ఉండొచ్చు" అన్నాను.

"థాంక్యూ సార్!" రెండు చేతులూ జోడించి అంది.

నాలుగురోజుల తరువాత ఆమె తెచ్చిచ్చిన కొటేషన్లు తీసుకుని, ఆమె అకౌంటుకి లిమిట్ పెంచి "నమ్మకస్తులకూ, మీకు బాగా తెలిసినవాళ్ళకే అప్పుగా ఇవ్వండి. అందరినీ గుడ్డిగా నమ్మకండి" అన్నాను.

"అలాగే సార్. ఈసారి కూడా బోణీ మీరే చెయ్యాలి" అంది నవ్వుతూ.

"తప్పకుండా" అన్నాను. అన్నట్లే ఆమె దగ్గర రెండు ప్యాంటు బిట్లు కొన్నాను.

కొద్దిరోజుల తర్వాత జయశ్రీ 'తాను సెకండ్‌హ్యాండ్ స్కూటీ కొన్నాననీ అందువల్ల కస్టమర్లు ఆర్డర్ చేసినవి సకాలంలో అందించగలుగుతున్నాననీ బట్టలు ఇంటింటికీ తీసుకెళ్ళి అమ్మగలుగుతున్నాననీ' చెప్పింది.

★ ★ ★

ఓ రోజు బ్యాంకుకు వచ్చిన జయశ్రీతో "రేపు మా బ్రాంచిలో 'కస్టమర్ రిలేషన్ ప్రోగ్రామ్' ఉంది. అందులో పాల్గొనడం కోసం ముఖ్యమైన కస్టమర్లను ఆహ్వానిస్తున్నాం. మీరూ రండి" అన్నాను.

"అయ్యో, వద్దు సార్. నేను చిన్న కస్టమర్‌ని. అక్కడ పెద్దపెద్ద వాళ్ళుంతా ఉంటారు. వాళ్ళ ముందు మాట్లాడాలంటే నాకు బెరుకుగా ఉంటుంది" అంది.

"మీరు మాట్లాడవద్దు. మిగిలినవారి మాటలు వినండి. అవి మీకు భవిష్యత్తులో ఉపయోగపడవచ్చు. బ్యాంకు స్వీటూ కాఫీ ఇస్తుంది... తీసుకోండి. మీకు ధైర్యం వచ్చి ఏదైనా చెప్పాలనిపిస్తే చెప్పండి. అది పొగడ్త అయినా, విమర్శ అయినా ఫరవాలేదు. బ్యాంకువాళ్ళు తమ లోపాలు సరిదిద్దుకోవడానికే ఇలాంటి మీటింగ్స్ ఏర్పాటు చేస్తారు" అన్నాను.

"అలాగే... వస్తాను సార్" అంటూ సెలవు తీసుకుంది జయశ్రీ.

శనివారం సాయంత్రం అయిదు గంటలకు ప్రారంభమైన ప్రోగ్రామ్ చాలా బాగా జరిగింది. ప్రోగ్రామ్ ముగిసేముందు అక్కడికి వచ్చిన ఓ లాయర్ కస్టమర్ మైకు తీసుకుని నన్నూ బ్యాంకునూ విమర్శించాడు.

'నేను అతనికి లోన్ ఇచ్చి అతను ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టకపోతే ఇంటికి వచ్చి అడిగాననీ, అందువల్ల ఇరుగుపొరుగువారి ముందు తన పరువు పోయిందంటూ, నాపై పరువు నష్టం దావా వేస్తానని' ఆవేశంగా అన్నాడు.

అందుకు జవాబుగా నేను మాట్లాడుతూ 'అతనికి రెండు నోటీసులు ఇచ్చాననీ, ఫోన్ కూడా చేశాననీ, అతను స్పందించకపోవడంతో ఇబ్బందేమిటో కనుక్కుని, వీలైతే పరిష్కారం కూడా చెప్పి సహాయం చేయడానికే



అతనింటికి వెళ్ళాననీ' చెప్పాను.

అతను కొందరి పేర్లు చెప్పి, "వందల వేల కోట్లలో అప్పులు తీసుకున్నవాళ్ళని వదిలేస్తారు. రెండు లక్షల రూపాయలు తీసుకున్న మాలాంటి వాళ్ళని మాత్రం వెంటాడి వేధిస్తారు" అన్నాడు.

వెంటనే జయశ్రీ లేచి "సార్, మీరు పేపరు చూడ్డం లేదా? మీరు చెప్పిన వాళ్ళందరిపైనా బ్యాంకు కేసులు పెట్టింది. విదేశాలకు వెళ్ళిన వాళ్ళపైన కూడా ఇక్కడ కేసులున్నాయి. లోన్ తీసుకున్న మనలాంటివాళ్ళు డబ్బులు తిరిగి కడితే మరో వందమందికి బ్యాంకు లోన్ ఇస్తుంది. అందువల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడతాయి. ఎంతోమందికి ఉద్యోగాలు వస్తాయి. తీసుకున్న డబ్బులు తిరిగి కట్టొద్దని అందరూ అనుకుంటే బ్యాంకులేమయిపోవాలి? బ్యాంకులన్నీ మూతపడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థే కూలిపోతుంది సార్. పక్కింటివాడు హత్య చేశాడని మనమూ చేస్తామా? హత్య చేయడం చట్టవిరుద్ధమైతే లోన్ డబ్బులు తిరిగి కట్టకపోవడం కూడా చట్టవిరుద్ధమే సార్" అంది ఆవేశంగా.

అందరూ జోరుగా చప్పట్లు కొట్టసాగారు.

జయశ్రీ తను మాట్లాడనని చెప్పి అంత బాగా మాట్లాడటం చూసి షాక్ తిన్నాను. ఆమెకు అంత విషయ పరిజ్ఞానం ఉంటుందని కూడా నేను ఊహించలేదు.

"జయశ్రీ ఎంత బాగా మాట్లాడింది? ఆ లాయరు నిన్ను తప్పుపట్టడం ఆమె సహించలేకపోయింది. నువ్వంటే ఆమెకి చాలా ఇష్టం" అన్నాడు శ్రీహరి అనే ఓ కొలీగ్- నాతో, ప్రోగ్రామ్ అయ్యాక.

"అవును. నాకూ తనంటే ఇష్టం."

"అంటే... ప్రేమా?"

"కాదు. ఇష్టం... అంతే! నాకు గాయని జానకమ్మ అంటే ఇష్టం- బాగా పాటలు పాడతారు కనుక. యాంకర్ సుమ అంటే ఇష్టం- ప్రతి ప్రోగ్రామ్ చక్కగా నడిపిస్తుంది కనుక. అలాగే జయశ్రీ అంటే ఇష్టం- తను కష్టపడుతుందీ నిజాయితీగా ఉంటుంది కనుకా, నేనంటే తనకు ఇష్టం- గౌరవం కనుక" అన్నాను.

శ్రీహరి ఇంకేం మాట్లాడలేదు.

★ ★ ★

కొద్దినెలలకు నాకు హైదరాబాదుకు ట్రాన్స్‌ఫర్ అయింది. జయశ్రీ ఆ వార్త విని చాలా బాధపడింది. ఆమెని ఇక తరచుగా చూడలేనని నాకూ బాధేసింది.

"మళ్ళీ ఎప్పుడొస్తారు హిందూపూర్?" అని అడిగింది నేను రిలీవ్ అయినరోజు బ్యాంకుకు వచ్చి.

"మీరు పెద్ద బట్టలషాపు పెట్టినప్పుడు ఓపెనింగ్‌కి వస్తాను" అన్నాను నవ్వుతూ.

హైదరాబాదుకు వెళ్ళాక మా అమ్మానాన్నలు నాకు చూసిన పెళ్ళి సంబంధాల్లో ఓ అమ్మాయి నాకు నచ్చడం, ఇరువైపుల అంగీకారంతో పెళ్ళి కుదరడం జరిగింది. నా కాబోయే భార్య విద్య కూడా ఓ ప్రభుత్వరంగ బ్యాంకులో ఆఫీసరు. పెళ్ళి శుభలేఖను జయశ్రీకి పంపాను. ఫోన్ చేసి కూడా ఆహ్వానించాను. ఆమె చాలా సంతోషించింది. పెళ్ళికి తప్పకుండా వస్తానంది.

మాంగల్యధారణ కార్యక్రమం అయ్యాక బంధుమిత్రులందరూ మాకు బహుమతులు అందజేస్తూంటే అందరితోపాటే క్యూలో వస్తూ నాకు కనిపించింది జయశ్రీ. ఆశ్చర్యంతో ఆమె వైపు చూశాను. జయశ్రీ- నాకూ విద్యకూ బట్టలు పెట్టి, మా ఇద్దరికీ అభినందనలు తెలిపింది.

★ ★ ★

రెండేళ్ళ తర్వాత ఓసారి మా బంధువు లబ్బాయి పెళ్ళికోసం విద్యతోపాటు అనంతపూర్ వచ్చాను. ముహూర్తం అయ్యాక నేనొక్కడినీ బయలుదేరి హిందూపూర్ వచ్చాను. బ్రాంచికి వెళ్ళి అందరినీ పలకరించాను. నాతోపాటు పనిచేసిన క్లర్క్ సురేష్‌ని జయశ్రీ గురించి అడిగితే తనిప్పుడు పెద్ద బట్టల దుకాణం పెట్టిందనీ... మా బ్యాంకే

లోన్ ఇచ్చిందనీ... బిజినెస్ బాగా జరుగుతోందనీ చెప్పాడు. తర్వాత- షాపు పేరేమిటో తెలుసా... 'శ్రీ కృష్ణ సిల్క్స్' అన్నాడు సురేష్.

ఆశ్చర్యంగా చూశాను అతనివైపు.

" 'జయశ్రీ'లోని- 'శ్రీ', 'కృష్ణమోహన్'లోని- 'కృష్ణ' కలిపి అలా పెట్టింది" అన్నాడు నావైపు చూసి అదోలా నవ్వుతూ.

"నా పేరుకు ముందు గౌరవసూచకంగా 'శ్రీ' పెట్టి ఉండొచ్చుగా. అవసర సమయంలో లోన్ ఇచ్చానని ఆ అమ్మాయికి నేనంటే గౌరవం, ఇష్టం. దయచేసి ఆ పేరులో ఇంకే అర్థాలూ వెతక్కు" అన్నాను అభ్యర్థనగా చూస్తూ. తర్వాత షాపు అడ్రస్ కనుక్కుని బయలుదేరి వెళ్ళాను.

చాలా పెద్ద షాపు అది. షాపులో జయశ్రీ కనపడలేదు. అక్కడి వాళ్ళను అడిగితే ఇంటికి వెళ్ళిందనీ కాసేపట్లో వస్తుందనీ చెప్పారు. ఓ రెడీమేడ్ షర్ట్ కొని కౌంటర్ దగ్గరికి వచ్చేసరికి జయశ్రీ అక్కడ కూర్చుని ఉంది. ఆమె ముందు ఇద్దరు కస్టమర్లు డబ్బులు చెల్లించడానికి నిలబడి ఉన్నారు.

ఇప్పుడు జయశ్రీ కొద్దిగా లావైంది. ముఖం మరింత కళగా కనిపిస్తోంది. మాస్క్ వేసుకుని తల దించుకుని ఆమె ముందు నిలబడ్డాను. అక్కడ పనిచేసే అమ్మాయి నేను సెలెక్ట్ చేసిన షర్ట్‌ని జయశ్రీకి ఇస్తే తను బిల్లు తయారుచేసి నాకు ఇచ్చింది. నేను డబ్బులు ఇస్తే తీసుకుని చిల్లర ఇస్తూ నావైపు చూసింది. అప్పుడు నేను మాస్క్ తీసి ఆమెవైపు చూస్తూ నిలబడి ఉన్నాను. ఆమె ముఖంలో ఆశ్చర్యం, ఆనందం, ఎగ్జైట్‌మెంట్.

"సార్... మీరా? అయ్యో, నేనెలా మిమ్మల్ని చూడలేదు. సారీ సార్" అంటూ కౌంటరుకు కొద్దిదూరంలో ఉన్న సోఫా దగ్గరికి నన్ను పిలుచుకెళ్ళింది. నేను కూర్చున్నాక కాఫీ తెమ్మని ఓ అమ్మాయిని పురమాయించింది. కాసేపు కౌంటర్ చూసుకోమని మరో అమ్మాయికి చెప్పింది.

"ఎలా ఉన్నారు సార్? విద్యా మేడమ్ ఎలా ఉన్నారు... పిల్లలా?" అని నన్ను అడిగింది.

"అందరూ బాగున్నారు. ఓ బాబు" అన్నాను.

"కంగ్రాట్స్ సార్. ఈ షాపు మీచేత ఓపెన్ చేయించాలని అనుకున్నాను. కాల్ చేస్తే మీరు రిసీవ్ చేసుకోలేదు" నిరాశగా అంది.

"అవును. నేనేదో ఇబ్బందుల్లో ఉండి రిసీవ్ చేసుకోలేదు... సారీ."


"ఫర్వాలేదు. ఇప్పుడు ఏ బ్రాంచీలో ఉన్నారు సార్?"

"ఎక్కడా లేను... ఇంట్లో ఉన్నాను?" నిర్లిప్తంగా అన్నాను.

"ఏమైంది సార్?" ఆందోళనగా అడిగింది.

"ఈ ఊరిలో 'మధు గ్రానైట్స్'కు నేను ఫీల్డ్ ఆఫీసరుగా ఉన్నప్పుడు పాతిక లక్షలు లోన్ ఇచ్చాను. నేనున్నంతవరకూ ఆ సంస్థ యజమాని దివాకర్- లోను డబ్బులు ఠంచనుగా కట్టేవాడు. నేను వెళ్ళిపోయాక నా తర్వాత వచ్చిన వాళ్ళు ఫాలోఅప్ చేయలేదు. ఫలితంగా లోన్ ఫెయిలైంది. దివాకర్ మనిషి మంచివాడే కానీ అవగాహన లేకుండా చాలాచోట్ల ఇన్వెస్ట్‌మెంట్లు చేసి నష్టపోయాడు. లోన్ శాంక్షన్ చేసినప్పుడు నాతోపాటు మేనేజరూ, ఇంకో ఫీల్డ్ ఆఫీసరూ సంతకం చేయాలి కానీ వాళ్ళు చేయలేదు. ఎందుకు చేయలేదో నాకు తెలియదు. నేనూ చూసుకోలేదు. నా ఒక్కడి సంతకమే ఉండటం వల్ల నేను అతనినుంచి వ్యక్తిగతంగా లాభం పొంది అతనికి లోన్ ఇచ్చినట్లు బ్యాంకు వారికి అనిపించింది. అందువల్ల నన్ను సస్పెండ్ చేశారు" చివరిమాట అంటున్నప్పుడు నా కళ్ళలో నీరు తిరిగింది.

"అయ్యో, మిమ్మల్నా?" అంటూ ఆశ్చర్యంతో, బాధతో చూసింది. తర్వాత "సార్, బాధపడకండి. క్రమశిక్షణకు మారుపేరు



మీరు. మీ నిజాయతీని బ్యాంకు తప్పకుండా గుర్తిస్తుంది" అంది ఓదార్పుగా.

ఇద్దరమూ కాఫీ తాగిన తర్వాత "ఆ డబ్బు మీరు కట్టేస్తే మిమ్మల్ని తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటారు కదా సార్?" అని అడిగింది.

"పాతిక లక్షలు కట్టేంత స్తోమత నాకు లేదు జయశ్రీ. పైగా నేను కడితే తప్పు ఒప్పుకున్నట్లు అవుతుంది. కడితే దివాకరే కట్టాలి. మీరు దీని గురించి బాధపడకండి. బ్యాంకులో ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. భగవంతుడు ఆ దివాకర్‌చేత డబ్బులు కట్టిస్తాడేమో చూద్దాం" అంటూ నవ్వి లేచి నిలబడ్డాను.

"తప్పకుండా. నాకూ ఆ నమ్మకం ఉంది సార్" అంటూ షాపు బయటివరకూ వచ్చి నన్ను సాగనంపింది జయశ్రీ.

★ ★ ★

ఆరునెలల తర్వాత బ్యాంకు హెడ్ ఆఫీసు నుంచి నాకు పిలుపొచ్చింది. మధు గ్రానైట్స్ వాళ్ళు డబ్బులు కట్టేశారని చెప్పి, ఇంతవరకూ బ్యాంకు విధి నిర్వహణలో నేను చూపిన అంకితభావమూ బ్రాంచి బిజినెస్ అభివృద్ధిలో నేను సాధించిన ఘనతలూ, ఉన్నత అధికారుల ప్రశంసలను పరిగణనలోకి తీసుకుంటూ ఇది మొదటి, చివరి తప్పుగా భావిస్తూ, ఇకపై వృత్తి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరిస్తూ, సిటీలోనే ఓ బ్రాంచికి నాకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ శుభవార్త ముందుగా విద్యతో పంచుకుని తర్వాత జయశ్రీకి కాల్ చేసి చెప్పాను. నేనూహించినట్లే ఆమె చాలా ఆనందించింది.

నెలరోజుల తర్వాత జయశ్రీ కాల్ చేసింది. 'తనకు పెళ్ళి కుదిరిందనీ, విద్యతోపాటు పెళ్ళికి తప్పకుండా వచ్చి తనను ఆశీర్వదించా'లనీ కోరింది. పెళ్ళికొడుకు గురించి అడిగితే, 'అతనిదీ హిందూపూరేననీ ఫ్రూట్ కేనింగ్ ఫ్యాక్టరీలు కొన్ని ఉన్నాయనీ ఇద్దరం ఒకరికొకరు నచ్చి వివాహం చేసుకుంటున్నా'మనీ చెప్పింది.

జయశ్రీ వివాహానికి విద్యతోపాటు వెళ్ళాను. మమ్మల్ని చూడగానే జయశ్రీ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. గిఫ్ట్ అందజేస్తున్నప్పుడు భర్తని మాకు పరిచయం చేసింది. ఈడూ జోడూ బాగున్నారని ఆ జంటని అభినందించాను. ఆమె వైవాహిక జీవితం ఆనందంగా గడవాలని ఆశీర్వదించాను. జయశ్రీ తల్లిగారిని కలసి ప్రత్యేకంగా అభినందించాను.

"ఇదంతా మీ చలవే సార్" అంది ఆవిడ చేతులు జోడించి.

పెళ్ళి అత్యంత వైభవంగా జరిగింది. జయశ్రీ మొదటిసారిగా చిన్న లోన్ కోసం నా ఎదురుగావచ్చి నిలబడిన దృశ్యం నా కళ్ళ ముందు మెదిలింది. 'కృషితో నాస్తి దుర్భిక్షం- అని పెద్దలు ఊరకే అనలేదు మరి' అనుకున్నాను.

భోజనాలయ్యాక స్టేజికి కొద్దిదూరంలో మా కొలీగ్స్ కనపడితే నేను దగ్గరికి వెళ్ళి వారిని పలకరించాను. వారిమధ్య సురేష్ కనిపించాడు.

"పెళ్ళికొడుకు కిరణ్ కూడా మన కస్టమరేనా?" అని అడిగాను అతన్ని.

"కాదు. అయితే అతను ఈమధ్యే మధు గ్రానైట్స్ ఫ్యాక్టరీని కొని, మన బ్యాంకు బాకీలన్నీ తీర్చేశాడు. అతను ఎందుకు కొన్నాడో ఎందుకు తీర్చేశాడో నీకు అర్థమైందనుకుంటాను" అన్నాడు ఓరకంట నన్ను చూసి నవ్వుతూ.

నాకు అర్థమైంది. అయితే నాకు నవ్వు రాలేదు, కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి.

నా కన్నీళ్ళు దాచుకోవడానికి పక్కకు వెళ్ళి స్టేజీ వైపు చూశాను. స్టేజీ పైన ఎవరితోనో మాట్లాడుతున్న జయశ్రీ నన్ను చూసి స్టేజీ దిగి నా దగ్గరికి వచ్చి "సార్, భోజనం చేశారా?" అని అడిగింది.

నాకు మాటలు రాలేదు. కళ్ళనిండా నీళ్ళతో రెండు చేతులూ జోడించి ఆమెకి నమస్కరించాను. ★

సిరులతల్లికి... సమర్పయామి!

కోరిన కోర్కెలు తీర్చి, సిరిసంపదలు ప్రసాదించమంటూ వరాలతల్లిని భక్తితో కొలిచే వరలక్ష్మీ వ్రత పర్వదినాన... దేవికి అర్పించే నైవేద్యాలూ ముఖ్యమేగా. మరి వీటిల్లో ఏం చేయాలనుకుంటున్నారో చూసేయండి.

మసాలా మినప గారెలు

కావలసినవి: పొట్టుమినప్పప్పు: రెండు కప్పులు, ధనియాలు: టేబుల్‌స్పూను, అల్లం ముక్కలు: పెద్ద చెంచా, జీలకర్ర: చెంచా, పచ్చిమిర్చి: నాలుగు, ఎండుమిర్చి: రెండు, కొత్తిమీర తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు: తగినంత, నూనె: వేయించేందుకు.

తయారీ విధానం: పప్పును నాలుగైదు గంటలు నానబెట్టుకుని తర్వాత పొట్టు పోయేలా కడగాలి. ఆ తర్వాత బరకగా రుబ్బుకోవాలి. అలాగే, ధనియాలు, అల్లంముక్కలు, జీలకర్ర, పచ్చిమిర్చి, ఎండుమిర్చిని కూడా బరకగా మిక్సీ పట్టుకోవాలి. ఈ మిశ్రమంతోపాటు తగినంత ఉప్పు, కొత్తిమీర తరుగును రుబ్బి పెట్టుకున్న పిండిలో వేసి బాగా కలిపి గారెల్లా చేసుకుని కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి.





సగ్గుబియ్యం పెసరపప్పు పాయసం

కావలసినవి: దోరగా వేయించిన పెసరపప్పు: చిన్నకప్పు, సగ్గుబియ్యం: కప్పు, బెల్లం తరుగు: రెండు కప్పులు, పాలు: మూడున్నర కప్పులు, నెయ్యి: రెండు టేబుల్‌స్పూన్లు, జీడిపప్పు: పావుకప్పు, కిస్‌మిస్: పావుకప్పు, యాలకులపొడి: అరచెంచా, ఎండుకొబ్బరి ముక్కలు: పావుకప్పు.

తయారీ విధానం: కుక్కర్‌లో పెసరపప్పు, సగ్గుబియ్యం తీసుకుని ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి రెండుకూతలు వచ్చేవరకూ ఉడికించుకోవాలి. అలాగే బెల్లంతరుగులో పావుకప్పు నీళ్లు పోసి స్టవ్‌మీద పెట్టి... తీగపాకం వస్తున్నప్పుడు తీసేసి వడకట్టి సగ్గుబియ్యం మిశ్రమంలో వేసి కలిపి మళ్లీ స్టవ్‌మీద పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక పాలు పోసి స్టవ్‌ని సిమ్‌లో పెట్టి... చిక్కగా అవుతున్నప్పుడు దింపేయాలి. చివరగా జీడిపప్పు, కిస్‌మిస్, ఎండుకొబ్బరి ముక్కల్ని నెయ్యిలో వేయించి పాయసంలో వేసి, యాలకులపొడి చల్లితే చాలు.

కొబ్బరి పాకం కజ్జికాయలు

కావలసినవి: మైదా: పెద్ద కప్పు, ఉప్పు: పావుచెంచా, వంటసోడా: చిటికెడు, చక్కెర: కప్పు, యాలకులు: నాలుగు, నూనె: వేయించేందుకు సరిపడా.

స్టఫింగ్‌కోసం: తాజా కొబ్బరితురుము: రెండు కప్పులు, బెల్లం తరుగు: ఒకటిన్నర కప్పు, నెయ్యి: చెంచా.

తయారీ విధానం: ఓ గిన్నెలో మైదా, ఉప్పు, వంటసోడా తీసుకుని నీళ్లు చల్లుకుంటూ పూరీపిండిలా కలిపి పైన కాస్త నూనె వేసి పక్కన పెట్టుకోవాలి. స్టవ్‌మీద ఓ గిన్నె పెట్టి కప్పు నీళ్లు పోసి, చక్కెర, యాలకులు వేయాలి. చక్కెర కరిగి పాకంలా మారుతున్నప్పుడు దింపేయాలి. అలాగే స్టవ్‌మీద మళ్లీ కడాయిని పెట్టి నెయ్యి వేసి.. కొబ్బరితురుమును దోరగా వేయించి బెల్లం తరుగు వేసి కలుపుతూ ఉండి... చిక్కగా అవుతున్నప్పుడు దింపుకోవాలి. ఇప్పుడు కొద్దిగా మైదా పిండిని తీసుకుని, కాస్త వెడల్పుగా ఒత్తుకుని.. కజ్జికాయ మౌల్డ్‌పైన ఉంచి ఒకటిన్నర చెంచాల కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి... అంచుల్ని నొక్కేయాలి. ఇలాగే మిగిలినవీ చేసుకుని రెండుమూడు చొప్పున కాగుతున్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి. వీటన్నింటినీ చేసిపెట్టుకున్న చక్కెరపాకంలో వేసి తీసుకుంటే చాలు. నోరూరించే కొబ్బరి పాకం కజ్జికాయలు నైవేద్యానికి సిద్ధం.



కొబ్బరి-మిరియాల అన్నం



కావలసినవి: పొడిపొడిగా వండిన అన్నం: రెండు కప్పులు, పచ్చికొబ్బరి తురుము: ఒకటింబావు కప్పు, నెయ్యి: రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, మినప్పప్పు: చెంచా, సెనగపప్పు: చెంచా, ఇంగువ: చిటికెడు, అల్లంతరుగు: చెంచా, ఎండుమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, పచ్చిమిర్చి: రెండు, పల్లీలు: పావుకప్పు, ఉప్పు: తగినంత, కరివేపాకు రెబ్బలు: రెండు, మిరియాలు: ఒకటిన్నర చెంచా.

తయారీ విధానం: ముందుగా కడాయిలో జీలకర్ర, మిరియాలు, ఒక ఎండుమిర్చిని వేయించి తర్వాత పొడి చేసుకోవాలి. స్టవ్‌మీద మళ్లీ కడాయిని పెట్టి నెయ్యి వేసి.. ఆవాలు, మినప్పప్పు, సెనగపప్పు, మిగిలిన ఎండుమిర్చి, పల్లీలు, జీడిపప్పు వేయించుకోవాలి. ఇందులో అల్లం తరుగు, కరివేపాకు రెబ్బలు, పచ్చిమిర్చి తరుగు వేయించి... కొబ్బరి తురుము, సరిపడా ఉప్పు, చేసిపెట్టుకున్న పొడి, అన్నం వేసి అన్నింటినీ బాగా కలపాలి.


దారి కనుక్కోండి

ఇంటికి వెళ్తూ దారిలో కనిపించిన పూలన్నీ కోసుకొని వెళ్లాలనుకుంది చిన్ని. మీరు తనకు సాయం చేయరూ!



చెప్పగలరా?

ఇక్కడున్న బొమ్మల్లో రెండు మాత్రమే ఒకేలా ఉన్నాయి. ఆ రెండూ ఏవో చెప్పగలరా?




తప్పులే తప్పులు

పిల్లలంతా ఎంచక్కా టీవీ చూస్తున్నారు కదూ! ఈ బొమ్మలో అయిదు తప్పులున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.



అవి ఏవి?

ప్లేస్కూల్‌లో రంగులను చెప్పే వర్డ్‌బోర్డులు కింద పడి ముక్కలు అయ్యాయి. అయితే, ఏ రెండింటిని కలిపితే అర్థవంతమైన పదం వస్తుందో చెప్పండి చూద్దాం.



తేడాలేంటి?

ఈ కింది బొమ్మల్లో ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?





సంజీవని పండు!



ఒకరోజు అక్బర్ సభలో కూర్చొని.. రాజ్యానికి సంబంధించిన విషయాలపైన చర్చించసాగాడు. బీర్బల్ కూడా అక్కడే ఉన్నాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి.. 'మహారాజా.. నా దగ్గర ఒక పండు ఉంది. అది సంజీవని ఫలం. నేనడిగే ప్రశ్నలకు ఇక్కడున్న వాళ్లెవరైనా సరైన జవాబులు చెబితే, అది మీకు ఇస్తాను' అంటూ తన దగ్గరున్న సంచిలోంచి ఒక పండును తీసి చూపించాడు. దాని సంగతేంటో చూద్దామనుకొని సరేనన్నాడు అక్బర్. ఆ వ్యక్తి వేసిన చిక్కు ప్రశ్నలన్నింటికీ బీర్బల్ నేర్పుగా సమాధానమివ్వడంతో, అతడు తన ఓటమిని అంగీకరించాడు. ఆ సంజీవని ఫలాన్ని సంచిలోంచి తీసి, అక్బర్‌కు ఇవ్వబోతుండగా.. బీర్బల్ అందుకొని గబగబా తినేశాడు. దాంతో అక్బర్ తీవ్ర ఆగ్రహంతో.. 'ఏంటి బీర్బల్ నువ్వు చేసిన పని? నేను ఆ పండును తిని ఎప్పటికీ మరణం లేనివాడిగా ఉందామనుకుంటే నువ్వు తినేశావు? ఇప్పుడే నీ తల తీయించేస్తాను చూడు..' అంటూ భటుల వైపు చూశాడు. 'మహారాజా.. అది నిజంగా సంజీవని ఫలమే అయితే, మీరు నన్నెలా చంపగలరు?' అని తెలివిగా అడిగాడు బీర్బల్. 'అది సంజీవని ఫలమనే నమ్మకం నాకు లేదు. నీ తల తప్పక తీయిస్తాను' అన్నాడు రాజు. వెంటనే 'రాజా.. అది మామూలు పండే అయితే, అంతమాత్రానికే నా తల తీయించాలా?' ప్రశ్నించాడు బీర్బల్. ఆ మాట వినగానే- అక్బర్‌తో సహా సభలో ఉన్నవారందరూ నవ్వేశారు. బీర్బల్ సమయస్ఫూర్తిని మెచ్చుకుంటూ చప్పట్లు కొట్టారు.

రంగులేద్దాం



చాక్లెట్లు ఎన్ని?

హరి, గిరి... ఇద్దరూ స్నేహితులు. హరి తన చేతిలోకి చాక్లెట్లను చూపిస్తూ... 'నీ దగ్గరున్న చాక్లెట్లలో ఒకటి నాకు ఇస్తే, ఇద్దరివీ సమానం అవుతాయి' అన్నాడు. అప్పుడు గిరి... 'నువ్వే నాకు ఒకటివ్వు... అప్పుడు నీకంటే నావి మూడు రెట్లు అవుతాయి' అన్నాడు. ఇంతకీ వారి దగ్గర ఉన్న చాక్లెట్లు ఎన్నో చెప్పగలరా?

పోలికలేంటి?

కింది బొమ్మల్లో అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న వాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



జవాబులు

తేడాలేంటి?: 1. నిల్చున్న బాబు చేతిలోని వస్తువు 2. పొద్దుతిరుగుడు మొక్క స్థానం 3. పాండా బొమ్మ రంగు 4. ఎడమవైపు సాక్సులు 5. డ్రమ్ముకు ఉన్న కర్ర 6. పుచ్చకాయ 7. గవ్వ దిశ 8. పాప జుట్టు.

చెప్పగలరా?: 2, 4

పోలికలేంటి?: అడ్డం: కిడ్స్ స్కూటర్, పెన్నుల స్టాండు, కత్తెర; నిలువు: కొయ్య గుర్రం, లూడో బోర్డు, కుండీ; ఐమూల: కేకు ముక్క, బొంగరం.


అవి ఏవి?: 1-6 (BLACK), 5-8 (GREEN), 2-7 (BROWN), 3-4 (WHITE).

తప్పులే తప్పులు: 1. గడియారంలో పన్నెండుకంటే ఎక్కువ గీతలు ఉన్నాయి 2. తలుపు గడియ పైకి ఉంది 3. టీవీలో బొమ్మ తలకిందులుగా ఉంది 4. బాబు ఫోర్క్‌తో సూప్ తాగుతున్నాడు 5. కుర్చీ కాళ్లు.

చాక్లెట్లు ఎన్ని?: 3, 5

సమీక్ష


మనిషిలో... మనిషి!



జీవితం అంటేనే మంచిచెడుల సంఘర్షణ. ఆ అంతస్సూత్రం దాట్ల దేవదానం రాజు 'మనిషి లోపలి నీడ' కథా సంపుటిలోనూ తొంగిచూస్తుంది. అండమాన్ జైలు మ్యూజియంలో స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాత జ్ఞాపకాల్ని నెమరేసుకునే మనవడి కథ 'ద్వీపాంతర వాసం'. మనుషుల్ని మతాలుగా విభజించి పాలించిన తెల్లవారి కుతంత్రం గురించి చదువుతున్నప్పుడు గుండెలు కుతకుతా ఉడికిపోతాయి. ఇచ్చిన మాట సంతకం కంటే గొప్పదని చాటిన గ్రామ ప్రజలూ, మాట కోసం నాస్తిక భావాల్ని పక్కన పెట్టిన కొడుకూ, మాట కోసమే మతాంతర వివాహానికి సిద్ధపడిన ఆ కొడుకు కొడుకూ... ఇలా మాట చుట్టూ అనుబంధాల కోటను కట్టారు 'వాగ్దాన పరిమళం' కథలో. వైరుధ్యాల పుట్ట అయిన ఓ హరిదాసు జీవన చిత్రణ... 'నగ్న సందేశం'. మారిన పరిస్థితులకు అనుగుణంగా మారే సాహసం చేయలేకా, ఆత్మాభిమానాన్ని చంపుకోలేకా... ఆలోచనలు వక్రించిన ఓ విధివంచితుడి కథ ఇది. మొత్తం పందొమ్మిది కథల సంకలనం ఈ పుస్తకం.

మనిషి లోపలి నీడ (కథలు)
రచన: దాట్ల దేవదానం రాజు
పేజీలు: 158; వెల: రూ.180
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

క్యాంపస్ కలలు



'ఇన్ఫోసిస్' సుధామూర్తి బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వేదికగా... ఉత్తరా రావు, జానకి పరాంజపే, అరవింద్ షా, సుబ్బారావు, సుమిత్రా అయ్యర్ అనే ఐదు పాత్రలతో అల్లిన అందమైన నవల 'జీవిత చక్రం'. క్యాంపస్ అంటేనే ఓ కలల కల్యాణ మండపం. అనేక స్వప్నాలతో విద్యాలయం ఆవరణలో అడుగుపెడతారు ఆ ఐదుగురు విద్యార్థులూ. పట్టా అందుకున్నాక, అంతే పట్టుదలతో విశాల ప్రపంచంలోకి వెళ్తారు. జీవన యాత్రలో ఆ ఐదుగురి విజయాలూ, వైఫల్యాలూ, సంతోషాలూ, విషాదాల చుట్టూ ఈ రచన తిరుగుతుంది. పాతికేళ్ల తర్వాత వాళ్లంతా మళ్లీ క్యాంపస్‌లో కలుసుకోవడంతో కథ ముగుస్తుంది. పాఠకుడు మాత్రం తన పాత జ్ఞాపకాల్లోకి వెళ్లిపోతాడు.

జీవిత చక్రం; రచన: సుధామూర్తి
పేజీలు: 216, వెల రూ.250
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.


అసలు చరిత్ర



ఈ పుస్తకం ప్రభువెక్కిన పల్లకి గురించి మాట్లాడదు. అది మోసిన బోయీల కథల్ని కళ్లకుకడుతుంది. చరిత్రకారులు విస్మరించిన మట్టి మనుషుల త్యాగాల్ని గుర్తుచేస్తుంది. 'చరిత్ర చెప్పని కథలు' ద్వారా రచయిత కళింగాంధ్రకు సంబంధించిన విస్మృత గాథల్ని అందించారు. బొబ్బిలి యుద్ధంలో ఎంకన్న పాత్ర, రణస్థలంలో గురప్ప దొర సాహసం, పాచిపెంటగా మారిన ప్రాచీపురం అసలు కథ, పొట్నూరులోని కృష్ణరాయల విజయ స్తంభం వెనకున్న దీనగాథ... ఇలాంటి అనేక చారిత్రక ఘట్టాల సమాహారం ఈ పుస్తకం. చదువరిలో ఆసక్తిని పెంచడానికి కొంత కల్పనను జోడించినా, ఎక్కడా వాస్తవాల్ని వక్రీకరించలేదని రచయిత చెప్పుకొచ్చారు.

చరిత్ర చెప్పిన కథలు
రచన: జి.వి.శ్రీనివాస్
పేజీలు: 199; వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 7702455559

ఓ అన్న కోసం...



కొన్నిసార్లు మరొకర్ని వెతికే ప్రయత్నంలో మనల్ని మనం తెలుసుకుంటాం. 'నువ్వు లేని అద్దం'లో అన్నను అన్వేషిస్తూ బయల్దేరిన ఓ కవల తమ్ముడు... అనుకోకుండా తోడబుట్టినవాడి భావుక ప్రపంచంలో అడుగుపెడతాడు. అతని స్వేచ్ఛా ప్రియత్వానికి అబ్బురపడతాడు. తారసపడిన ప్రతి పాత్రా ఓ విలువైన పాఠాన్ని నేర్పుతుంది. అంతిమంగా అన్నయ్యను కనిపెడతాడా, లేదంటే తానే అన్నయ్య అవుతాడా అన్నది నవల చదివితేనే తెలుస్తుంది. భావుకతా, ప్రతీకాత్మకతా కలగలిసిన రచన ఇది.

నువ్వు లేని అద్దం
రచన: మెహెర్
పేజీలు: 114; వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

బుక్ షెల్ఫ్

మళ్లీ పెళ్లి కథలు
రచన: లాల లింగమూర్తి
పేజీలు: 363; వెల: రూ.100
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

వెన్నెల గింజలు (కవితా సంపుటి)
రచన: చిటిప్రోలు సుబ్బారావు
పేజీలు: 270; వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

ఆదిమ పోరుడు
రచన: కేశవ కుమార్
పేజీలు: 151; వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9247471362

భాషా పరిమళాలు
రచయితలు: వాడిలాల సుబ్బారావు, సోమంచి వినయభూషణరావు
పేజీలు:136; వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

లవ్... టెన్స్
...కాలంతో పాటు ప్రేమ
రచన: విజయలక్ష్మి వెంకట్
పేజీలు:100; వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 8558899478

ఆశల దోపిడి
(మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలు)
రచన: అరుణా రవికుమార్
పేజీలు:136; వెల: రూ.249
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

భూమి పుత్రుడు (నవల)
రచన: ఎమ్.ఆర్.వి.సత్యనారాయణ మూర్తి
పేజీలు:116; వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

ప్రతిబింబాలు (కథల సంపుటి)
రచన: కస్తూరి అలివేణి
పేజీలు:113; వెల: రూ.180
ప్రతులకు: ఫోన్: 9849023582

అమ్మలేని జీవితం (కథా సంపుటి)
రచన: పంతంగి శ్రీనివాసరావు
పేజీలు:140; వెల: రూ.220
ప్రతులకు: ఫోన్: 9885112517

ఆధ్యాత్మిక బోధనలు
రచన: ఎన్.ఎ.కలామ్
పేజీలు: 258, వెల: రూ.350
ప్రతులకు: ఫోన్: 9948510320

రాశి ఫలం

గ్రహబలం
(ఆగస్టు 3 - 9)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విజయం లభిస్తుంది. లక్ష్య సాధనకు మరింత ధైర్యం అవసరం. వ్యాపారంలో లాభాలు గోచరిస్తున్నాయి. సమయస్ఫూర్తితో ఉత్తమ ఫలితాలను అందుకుంటారు. ఉద్యోగుల భవిష్యత్తు బావుంటుంది. కృషికి తగిన ఫలితం ఉంటుంది. క్రమశిక్షణతో పని ఒత్తిడిని అధిగమించండి. వారం మధ్యలో ఓ శుభం జరుగుతుంది. ఇష్టదైవాన్ని ఆరాధించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

శుభాలు జరుగుతాయి. చేపట్టిన పనులన్నీ వేగంగా పూర్తవుతాయి. అధికారయోగం సూచితం. గతంలోని ఇబ్బందులు తొలగిపోతాయి. ఆర్థిక ఫలితాలు బావున్నాయి. ఆస్తులు వృద్ధి చెందుతాయి. వివాదాల జోలికి వెళ్లకండి. కష్టకాలంలో దైవబలం సహకరిస్తుంది. మహాలక్ష్మిని ధ్యానించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

మనోబలమే నడిపిస్తుంది. ముఖ్య విషయాల్లో మీదే పైచేయి అవుతుంది. కానీ ముందస్తు ప్రణాళిక అవసరం. వ్యాపారంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. మొహమాటాలు వద్దు. ఉద్యోగులు ఆత్మవిశ్వాసంతో సమస్యల్ని అధిగమిస్తారు. ఉద్దేశపూర్వకంగా ఒత్తిడికి గురిచేసేవారితో జాగ్రత్త. వివాదాలకు దూరంగా ఉండండి. ఇష్టదేవతను ఆరాధించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

కృషికి తగిన ఫలితం ఉంటుంది. కాలం కాస్త వ్యతిరేకంగా ఉంది. ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయండి. ఆచితూచి వ్యవహరించండి. మీ ధర్మాన్ని మీరు చిత్తశుద్ధితో నిర్వర్తించండి. ఉద్యోగులు ప్రశాంత చిత్తంతో పనిచేయాలి. చెడును అతిగా ఊహించుకోకండి. వ్యాపారంలో ముందుజాగ్రత్త అవసరం. లక్ష్మీనరసింహ స్వామిని ఉపాసించండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఏకాదశంలో గురుబలం ఉంది. ముఖ్య విషయాల్లో మీదే విజయం. కాలాన్ని వృథా చేసుకోకండి. ఆర్థిక వ్యవహారాల్లో తీపి మాటలకు మోసపోవద్దు. ఆస్తులు వృద్ధి చెందుతాయి. గృహ నిర్మాణం గురించి ఆలోచిస్తారు. మనోబలంతో వ్యాపార అవరోధాలను అధిగమిస్తారు. నవగ్రహ స్తోత్రాలను పఠించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగ జీవితం శుభప్రదం. ప్రారంభించిన పనులు సత్ఫలితాలను ఇస్తాయి. అధికార లాభం సూచితం. తోటివారి ప్రోత్సాహం లభిస్తుంది. దీర్ఘకాలిక ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారంలో కలిసొస్తుంది. ఆర్థికంగా ఇది మిశ్రమకాలం. రుణ సమస్యలకు ఆస్కారం ఉంది. లక్ష్మీదేవిని పూజించండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రారంభించిన ప్రతి పనీ విజయవంతం అవుతుంది. ఆశయాలు నెరవేరతాయి. చిత్తశుద్ధితో పనిచేసి అనుకున్న ఫలితాలను అందుకుంటారు. కీర్తి పెరుగుతుంది. పెద్దల ప్రోత్సాహం లభిస్తుంది. జీవితంలో స్థిరత్వం ఏర్పడుతుంది. ఉద్యోగంలో ఉన్నత స్థితి గోచరిస్తోంది. ఆర్థికంగా వృద్ధిని సాధిస్తారు. వ్యాపారం లాభదాయకం. అష్టలక్ష్మిని ధ్యానించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

శుభకాలం కొనసాగుతోంది. అందివచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోండి. సంకోచాలకు తావివ్వకండి. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. అవసరాలకు డబ్బు అందుతుంది. వివాదరహితంగా సంభాషించండి. వారం మధ్యలో ఓ సమస్య పరిష్కారం అవుతుంది. వారాంతంలో శుభవార్త వింటారు. సూర్యుడిని ఉపాసించండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

విజయాలు సాధిస్తారు. కీలక నిర్ణయాల సమయంలో లోతుగా ఆలోచించండి. తొందరపాటు చర్యలు వద్దు. ఉద్వేగాలను అదుపులో ఉంచుకోండి. వ్యాపారంలో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. మిత్రుల సూచనలు మంచి చేస్తాయి. మితభాషణం అవసరం. ఓ శుభవార్త వింటారు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మనోబలంతో కొత్త పనులను ప్రారంభించండి. ఆరంభశూరత్వం వద్దు. స్థిర చిత్తంతో లక్ష్యాలను పూర్తిచేయండి. చెడు ఆలోచనలకు ఆస్కారం ఇవ్వకండి. చిన్నపాటి అవరోధాలు ఎదురైనా, మానసిక ఒత్తిడికి గురికాకండి. వృత్తి ఉద్యోగాల్లో ఆటంకాలు ఉన్నాయి. ఆర్థిక జాగ్రత్తలు అవసరం. నవగ్రహాల్ని పూజించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

విజయాలు గోచరిస్తున్నాయి. ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకోండి. స్వల్ప ప్రయత్నంతోనే అనుకున్న పనులు పూర్తవుతాయి. పదవీయోగం ఉంది. పెద్దల ప్రశంసలు అందుతాయి. వ్యాపార లాభాలు ఉన్నాయి. మీ వల్ల కొందరికి మేలు జరుగుతుంది. కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. అందివచ్చిన అవకాశాల్ని వదులుకోకండి. లక్ష్మీదేవిని ఉపాసించండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

లక్ష్మీకటాక్షం లభిస్తుంది. అవసరాలకు డబ్బు అందుతుంది. కృషిని బట్టి ఫలితం ఉంటుంది. వృత్తి, వ్యాపారాల పట్ల మరింత శ్రద్ధ అవసరం. ఉద్యోగులు ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలి. చిన్నపాటి అవరోధాలు ఎదురైనా నిరాశ వద్దు. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. పట్టుదల చాలా అవసరం. ఆత్మీయుల సలహాలు తీసుకోండి. నవగ్రహాల్ని ధ్యానించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. చలనం లేనిది... అవని (3)
3. ఫ్యాన్; గాలిమర (2)
5. స్మృతి (3)
7. క్షణమాత్రం (3)
8. మేఘాల వరస (4)
10. ముడుపులు (3)
12. జనులు (3)
14. మూడు (1)
15. అడ్డం 14తో ధరణి (1)
16. కష్టం, ఆపద (3)
19. ప్రపంచంలో (3)
22. కెరటం (2)
23. నిస్పృహ, అడియాస (3)
25. ముక్తాయింపు, ముగింపు, పలితం, పర్యవసానం (5)
27. అంతంలేని త్రినేత్రుడు (2)
28. ఒక రాశి (2)
29. యవ్వనం, పడుచుప్రాయం (4)
30. రొద, కలకలం (2)
32. దేవుడు ఇచ్చేది..? (2)
34. సీతారామశాస్త్రి ఇంటిపేరుగా మారిన సినిమా (5)
37. గృహలక్ష్మి (3)
39. స్వప్నం (2)
40. పరిశుద్ధుడు, పవిత్రుడు (4)
42. ఆభరణం (2)
44. మెటల్... ఇనుము, బంగారం వంటివి (2)
46. '..... పాట' అంటే జోలపాట (2)
49. కోట చుట్టూ అగడ్త (3)
50. హారాలు, మాలలు (3)
51. నందనుడు (4)

1		2	*	3		*	4	*	5		6
	*	7			*	8		9		*	
10	11		*	12	13		*		*	14	*
*		*	15	*		*	16		17	*	18
19		20	*	21	*	22		*	23	24	
	*	25					*	26	*	27	
*	28		*		*	29				*	
30		*	31	*	32		*		*	33	*
*	34	35				*	36	*	37		
38	*	39		*	40	41			*		*
42	43	*	44	45	*	46		*	47	*	48
49			*	50			*	51			

నిలువు

1. నిర్మలం, స్వచ్ఛం (3)
2. వంద '.....' ఒక కోటి (3)
3. బురదలో (3)
4. చెమట (2)
5. జ్ఞానవంతుడు, వివేకి (2)
6. గొంతు (2)
8. పాదం (2)
9. పాపడు, బుడతడు (3)
11. వాన కోయిల (3)
13. కడుపు, పొట్ట (2)
16. పుడమి (2)
17. ఋషి, తాపసి (2)
18. విష్ణువు (4)
19. పిసినారి (2)
20. లోన (3)
21. జీవిక, జరుగుబాటు (3)
22. తరువాత, పిమ్మట (4)
24. కుప్ప, పోగు (2)
26. వర్తకం, వ్యాపారం (3)
28. పెరట్లో పూజించే మొక్క (3)
31. గుడిలో (4)
32. ప్రేమ (3)
33. '..... గట్టితేనేమి మా గాంధి...'- గూడవల్లి వారి 'మాలపిల్ల' చిత్రంలోని ఈ గీతం ఒకప్పుడు తెలుగునేల నలుచెరగులా మార్మోగిపోయింది (3)
35. ఏనుగు... తలకిందులుగా (2)
36. మేనమామ భార్య (3)
38. కుక్క (3)
41. నీలివర్ణపు రత్నాలు (3)
43. ఒక ఆయుధం (2)
45. మరాళం (2)
47. లోయ (2)
48. అధికం (2)

సుడొకు

7			8			5	9	
	8	9			1	4		2
6		5			9	3		
5	2	1						
				3				
						2	5	4
		8	2			9		6
9		4	6			7	2	
	7	6			8			5

గతవారం సమాధానాలు

పదకేళి

1 భా	ద్ర	2 ప	3 దం	*	4 కా	దం	5 బ	రి	*	6 ఆ	7 శ
గీ	*	8 వ	దా	9 వ	ళి	*	డి	*	10 యం	*	శాం
11 ర	12 త	నం	*	ది	*	13 పా	త	14 కం	*	15 ఏ	కు
16 ధి	ర	*	17 అ	న	18 లు	డు	*	19 దు	ర్జ	ను	డు
*	20 వా	ర	ధి	*	వే	*	21 బ	కం	*	గు	*
22 వే	ణీ	*	23 కు	ప్ప	*	24 క	రి	*	25 సం	*	26 స
టు	*	27 వం	డు	*	28 అ	ల	*	29 ఇం	దు	30 వా	రం
*	31 ఢం	కా	*	32 అ	మ	రా	33 వ	తి	*	లు	*
34 కూ	*	35 య	మ	పు	రి	*	డి	*	36 అం	గ	37 న
38 స	39 క	లు	*	40 రూ	క	41 లు	*	42 కొం	ప	*	క్క
*	ల్లా	*	43 కో	పం	*	44 క	ల్లి	*	45 శ	రం	*
46 స	రం	జా	మా	*	47 లే	శం	*	48 కొ	య్యో	*	49 త్రం

సుడొకు

8	6	9	1	2	5	7	3	4
2	7	1	4	8	3	9	6	5
5	3	4	9	6	7	1	8	2
6	5	8	2	1	4	3	9	7
9	2	3	7	5	8	4	1	6
1	4	7	3	9	6	2	5	8
3	9	6	8	7	2	5	4	1
4	8	2	5	3	1	6	7	9
7	1	5	6	4	9	8	2	3

A B C D E F 1 2 3







ఉల్లిబొమ్మ...
బాగుందమ్మా!





'చేతిలో కళ ఉండాలే కానీ దాన్ని ఎందులోనైనా చూపించొచ్చు' అనేందుకు చక్కటి ఉదాహరణ- ఇక్కడున్న ఉల్లిపాయల బొమ్మలు. వంట రుచిగా చేయడంలోనే కాదు, కూరగాయల ముక్కలు కోయడంలోనూ ఎంతో శ్రద్ధ చూపిస్తుంటారు షెఫ్‌లు. నోరూరించే ఆ వంటకాల్ని అందంగా అలంకరిస్తుంటారు కూడా. ఆ కోవలోనే- వెజిటబుల్ కార్వింగ్‌తో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నారు కొందరు ఫుడ్ ఆర్టిస్టులు. రకరకాల ఉల్లిపాయల్ని వివిధ సైజుల్లో తీసుకుని, జంతువుల ఆకారానికి తగ్గట్టుగా తీరుగా కత్తిరించుకుంటూ, అవసరమైన చోట పొరలుపొరలుగా అమర్చుకుంటూ... ఆనియన్ యానిమల్స్‌ని తీర్చిదిద్దుతున్నారు. కాస్త సృజన, మరికాస్త ఓపికా ఉంటే సరదాగా మీరూ ఈ ఉల్లిపాయ బొమ్మల్ని చేసి చూడొచ్చు. ఓసారి ట్రై చేయండి మరి!







ప్రకృతి- వర్ణచిత్రమేదో గీయడానికి రంగుల ప్యాలెట్‌ని సిద్ధం చేసినట్టుగా కనిపిస్తోంది కదూ ఇక్కడున్న చిత్రం. ఈ దృశ్యాన్ని కళ్లారా చూడాలంటే ఇండోనేషియాలోని ఫ్లోరెస్ దీవిలో ఉన్న కెలిముటు పర్వతం దగ్గరకు వెళ్లాల్సిందే. ఈ అగ్నిపర్వతాన్ని ఆనుకుని మూడు సరస్సులు- నీలం, ఎరుపు, ఆకుపచ్చ-పసుపు వర్ణాలతో అందర్నీ ఆకట్టుకుంటాయి. అగ్నిపర్వతం నుంచి వెలువడే వాయువులూ, భూగర్భంలోని ఖనిజాలూ, వాతావరణ మార్పులే ఈ అరుదైన రంగులకు కారణమట. స్థానికులు మాత్రం- ఆ సరస్సుల్లో తమ పూర్వీకులు ఉంటారని కథలుకథలుగా చెప్పుకుంటూ ఏటా ఆగస్టులో వారిని స్మరించుకుంటూ ఇక్కడ పూజలు జరుపుకోవడం విశేషం.

